మన తెలుగు దిన పత్రిక ప్రజా గళం
R.NO. T/TG/2026/0111/2018/1268

తమిళనాడులో రాజకీయ సంచలనం



3 లో..

హైదరాబాద్ సంపుటి : 1 సంచిక 16 శనివారం 09 మే 2026 పేజీలు :08 వెల:రూ.5/-

# కాలుష్య రహిత హైదరాబాద్ లక్ష్యం

- హాజీల అదనపు భారాన్ని భరిస్తామని ప్రకటన
- హజ్ యాత్రికుల బస్సులకు జెండా ఊపిన ముఖ్యమంత్రి



**హైదరాబాద్, మే 8 (మన ప్రజాగళం):**
హైదరాబాద్‌ను కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు నగరంలోని ఆటోలను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. కోర్ అర్బన్ రీజియన్‌లో ఉన్న ఆటోలకు ప్రభుత్వ నిధులతో రెట్రో ఫిట్టింగ్ చేయించేందుకు ఐదు కంపెనీలతో చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు. హైదరాబాద్ హజ్ హౌజ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి హజ్ యాత్రకు బయలుదేరుతున్న యాత్రికుల బస్సులకు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మహ్మద్ అజహరుద్దీన్, ఎంపీలు అసదుద్దీన్ ఒవైసీ తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.
సభలో మాట్లాడిన ముఖ్యమంత్రి హజ్ యాత్రకు వెళ్తున్న యాత్రికులకు తెలంగాణ ప్రభుత్వం తరఫున శుభాకాంక్షలు తెలిపారు. మైనారిటీల సంక్షేమం, అభివృద్ధి విషయంలో ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. హిందూ, ముస్లింలు తనకు రెండు కళ్ల లాంటి వారని, ఇద్దరూ అన్నదమ్ముల్లా కలిసి తెలంగాణ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. మైనారిటీల నిష్పత్తికి అనుగుణంగా సంక్షేమ పథకాల

మిగతా 2 లో..

## ప్రధాని పర్యటనకు విస్తృత ఏర్పాట్లు

- మే 10 పర్యటనపై అధికారుల సమీక్ష
- పోలీసు, మున్సిపల్ శాఖల సంయుక్త తనిఖీలు
- భద్రతా చర్యలపై ప్రత్యేక దృష్టి

**హైదరాబాద్, మే 8(మన ప్రజాగళం):**
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మే 10న తెలంగాణ పర్యటనకు రానున్న నేపథ్యంలో సైబరాబాద్ ప్రాంతంలో అధికారులు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. పోలీసు శాఖ, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, భద్రతా సంస్థలు సమన్వయంతో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నాయి. ప్రధాని పర్యటన మార్గాల్లో పోలీసు, మున్సిపల్ బృందాలు సంయుక్తంగా



మిగతా 2 లో..

## టీఎంసీ పాలనకు ముగింపు

- బెంగాల్‌లో బీజేపీ అద్భుత విజయం సాధించింది
- కాంగ్రెస్ ఆత్మపరిశీలన చేసుకోవాలి

అమిత్ షా



## హంతా వైరస్‌పై ప్రపంచం అప్రమత్తం

- శరవేగంగా వ్యాపిస్తున్న హంతా వైరస్
- డచ్ క్రూయిజ్ షిప్‌లో ముగ్గురు మృతి
- ప్రపంచ దేశాలతో కలిసి పని చేస్తున్న డబ్ల్యూహెచ్‌ఓ

**జెనీవా, మే 8 (మన ప్రజాగళం):**
ప్రపంచాన్ని వణికించిన కోవిడ్ మహమ్మారి తర్వాత ఇప్పుడు హంతా వైరస్ మరోసారి అంతర్జాతీయ ఆందోళనకు కారణమవుతోంది. ఇటీవల డచ్ క్రూయిజ్ షిప్ "ఎంవీ హోండియస్"లో హంతా వైరస్ కేసులు బయటపడటంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ అప్రమత్తమైంది. ఈ వైరస్‌కు సంబంధించిన కేసులు పలు దేశాల్లో నమోదవుతున్న నేపథ్యంలో సభ్య దేశాలను జాగ్రత్తగా ఉండాలని సూచించింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ వివరాల ప్రకారం.. ప్రస్తుతం హంతా వైరస్‌కు సంబంధించిన ఐదు నిర్ధారిత కేసులు, మరికొన్ని అనుమానిత కేసులు వెలుగులోకి వచ్చాయి. ఈ వైరస్ బారినపడి ఇప్పటికే ముగ్గురు మృతి చెందినట్లు వెల్లడించింది. మరణించిన వారిలో డచ్ దంపతులతో పాటు జర్మనీకి చెందిన వ్యక్తి ఉన్నట్లు సమాచారం. ఈ వైరస్ వ్యాప్తికి కేంద్రంగా మారిన డచ్ క్రూయిజ్ షిప్‌లో మొత్తం 23 దేశాలకు చెందిన 149 మంది ప్రయాణికులు



మిగతా 2 లో..

# కొడంగల్‌ను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

- అభివృద్ధిపై సీఎం ఫోకస్
- 2027 నాటికి పనులు పూర్తి
- బాలాజీ ఆలయానికి భూమిపూజ
- విద్య, పరిశ్రమలపై ప్రత్యేక దృష్టి



**కొడంగల్, మే 8 (మన ప్రజాగళం):**
అభివృద్ధి విషయంలో రాజకీయాలు, గుంపులు, గ్రూపులు పక్కనపెట్టి అందరూ కలిసికట్టుగా పనిచేస్తే కొడంగల్ నియోజకవర్గాన్ని రాష్ట్రానికే కాకుండా దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దవచ్చని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ప్రజల



మిగతా 2 లో..

## రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయి

- కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ విమర్శలు
- పోలీస్ వ్యవస్థను రాజకీయాలకు వాడుకుంటున్నారని ఆరోపణ
- ప్రజల భద్రతపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని డిమాండ్



**హైదరాబాద్, మే 8 (మన ప్రజాగళం):**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో

మిగతా 2 లో..

## చిట్టగాంగ్ తీరానికి చేరుకున్న భారత నౌక

**ఢాకా, మే 8 (మన ప్రజాగళం):**
భారత మహాసముద్ర నౌక "ఐఎస్ సాగర్" బంగ్లాదేశ్‌లోని చిట్టగాంగ్ నౌకాశ్రయానికి విజయవంతంగా చేరుకుంది. బంగాళాఖాతంలో విజయవంతమైన ప్రయాణం అనంతరం ఈ



మిగతా 2 లో..


విలేఖరులు కావలెను...

విశేష ఆదరణతో దూసుకుపోతున్న తెలుగు దినపత్రిక "మన ప్రజాగళం" పత్రికలో పనిచేయుటకు రిపోర్టర్లు, మండలల్లా వారీగా.మరియు నియోజకవర్గ ఇన్‌చార్జిలు, జిల్లా స్టాఫర్లు కావాలెను.

వివరాలకు సంప్రదించవలసిన పోన్ నెంబరు.
9390 875876


# మూసీ పునర్జీవం పనులకు వేగం

- క్యాబినెట్ సబ్ కమిటీ కీలక నిర్ణయాలు
- ప్రజల ఇళ్లకు నష్టం లేకుండా ప్రణాళిక
- 2027 నాటికి ప్రాజెక్టు పూర్తి లక్ష్యం

**హైదరాబాద్, మే 8 (మన ప్రజాగళం):**
మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అధ్యక్షతన మూసీ పునర్జీవం ప్రాజెక్టుపై క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్‌తో పాటు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.మూసీ నది పునరుజ్జీవనం కేవలం అభివృద్ధి ప్రాజెక్టు మాత్రమే కాదని, అది నగరవాసుల సామాజిక బాధ్యత అని కమిటీ స్పష్టం చేసింది. అభివృద్ధి పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేయకుండా వారిని భాగస్వాములను చేస్తూ ముందుకు సాగాలని అధికారులకు సూచనలు జారీ చేసింది. ప్రజల ఆస్తులు, నివాసాలకు కనీస నష్టం కూడా కలగకుండా ప్రాజెక్టు అలైన్‌మెంట్‌ను అవసరమైతే మార్చుకోవాలని కమిటీ ఆదేశించింది. ఫేజ్-1 కోసం సుమారు ?7,055 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పనులకు ఆసియా అభివృద్ధి బ్యాంక్ నుంచి నిధులు సమకూర్చుకునేందుకు జరిగిన చర్చలు విజయవంతమైనట్లు వెల్లడించారు.
హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ నుంచి బాపూఘాట్ వరకు 21 కిలోమీటర్ల పరిధిలో తొలి ఐదు కిలోమీటర్ల



మిగతా 2 లో..

# కొడంగల్‌ను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

(మొదటి పేజీ తరువాయి..)

భాగస్వామ్యంతో చేపడుతున్న అభివృద్ధి పనులను 2027 డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. కొడంగల్‌లో నిర్వహించిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న సీఎం.. నియోజకవర్గ భవిష్యత్‌పై భారీ ప్రణాళికలను వెల్లడించారు. కొడంగల్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం పునర్నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన యాగంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి దామోదర రాజనర్సింహతో పాటు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కొడంగల్ బాలాజీ ఆలయాన్ని తెలంగాణ పేదల తిరుపతిగా అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని సీఎం తెలిపారు.

ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా కొడంగల్‌లో 430 పడకల ఆసుపత్రి నిర్మాణానికి కూడా సీఎం శంకుస్థాపన చేశారు. అలాగే దౌల్తాబాద్ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం, కోస్గి శ్రీ వేణుగోపాలస్వామి ఆలయాల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురైన ఈ ప్రాంతంలో ఇప్పుడు సమగ్ర అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయని పేర్కొన్నారు. కొడంగల్ ప్రాంతాన్ని విద్యా కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం భారీ ప్రణాళిక రూపొందించినట్లు సీఎం వెల్లడించారు. 225 ఎకరాల్లో మెడికల్ కళాశాల, ఇంజనీరింగ్ కళాశాల, డిగ్రీ కళాశాలలు, పాలిటెక్నిక్, ఐటీఐ, సైనిక్ స్కూల్స్‌తో కూడిన ఎడ్యుకేషనల్ హబ్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గతంలో చదువుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని, ఇప్పుడు రాష్ట్రం నలుమూలల నుంచి విద్యార్థులు కొడంగల్‌కు వచ్చే పరిస్థితిని తీసుకురావాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని చెప్పారు.

మక్తల్--నారాయణపేట--కొడంగల్ ప్రాంతాలకు సాగునీరు అందించే ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. కృష్ణా నది జలాలతో ఈ ప్రాంత భూములు తడవాలని, ఇందుకోసం భూసేకరణ పూర్తైందని, అవసరమైన అనుమతులు కూడా వచ్చాయని తెలిపారు. పనుల పురోగతిపై ప్రతి నెల సమీక్ష నిర్వహించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రిని కోరారు. ఈ ప్రాంతంలో రైల్వే, పరిశ్రమల అభివృద్ధికి కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. కృష్ణా--వికారాబాద్ రైల్వే లైన్‌కు సూత్రప్రాయ అనుమతి వచ్చిందని వెల్లడించారు. టేకులగోడు ప్రాంతంలో భారీ సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఆరు నెలల్లో పరిశ్రమ నిర్మాణం ప్రారంభమైతే స్థానిక యువతకు పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. లగచర్ల వద్ద భారీ ఇండస్ట్రియల్ పార్క్ నిర్మాణం చేపడుతున్నామని, కోస్గి నుంచి అంతర్జాతీయ విమానాశ్రయం వరకు 300 అడుగుల వెడల్పుతో రహదారి నిర్మాణం జరుగుతోందని సీఎం వెల్లడించారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే కొడంగల్ ప్రాంత ఆర్థిక పరిస్థితి పూర్తిగా మారిపోతుందని చెప్పారు. కొడంగల్ బాలాజీ ఆలయం పునర్నిర్మాణం రాజకీయాలకు అతీతమైన ఆధ్యాత్మిక కార్యక్రమమని సీఎం స్పష్టం చేశారు. కర్ణాటక, మహారాష్ట్ర నుంచి వచ్చే భక్తులకు కూడా ఇది ప్రధాన ఆధ్యాత్మిక కేంద్రంగా మారుతుందని తెలిపారు. ఆలయ పునర్నిర్మాణం ద్వారా కొడంగల్ పేరు దేశవ్యాప్తంగా వినిపించేలా చేస్తామని అన్నారు.

సుందర వరదాచార్యుల చివరి కోరిక మేరకు ఆలయ అభివృద్ధి చేపడుతున్నామని సీఎం గుర్తుచేశారు. వారి సేవలను గుర్తుంచుకునేలా ఆలయ ప్రాంగణంలోని ఒక విడిదికి వారి పేరు పెట్టాలని అధికారులకు సూచించారు. ఈ ప్రాంత ప్రజలు చిన్న చిన్న విభేదాలు పక్కనపెట్టి అభివృద్ధి కోసం కలిసిరావాలని సీఎం పిలుపునిచ్చారు. "ఈ రోజు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా కొడంగల్ బిడ్డ మీ ముందున్నాను. కొడంగల్ అభివృద్ధి నా బాధ్యత. ఈ ప్రాంత ప్రతిష్టను దేశస్థాయికి తీసుకెళ్లేలా ప్రతి ఒక్కరూ సహకరించాలి" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# చిట్టగాంగ్ తీరానికి చేరుకున్న భారత నౌక

(మొదటి పేజీ తరువాయి..)

నౌక చిట్టగాంగ్ హార్బర్‌లోకి ప్రవేశించినట్లు ఢాకాలోని భారత హైకమిషన్ వెల్లడించింది. "ఐఎస్ సాగర్ 2026" బహుళ దేశాల నౌకాదళ విన్యాసాల్లో భాగంగా ఈ పర్యటన జరుగుతోంది. ఈ సందర్భంగా భారత నౌకాదళం, బంగ్లాదేశ్ నౌకాదళాల మధ్య ఉన్న బలమైన స్నేహబంధం మరోసారి స్పష్టమైందని అధికారులు పేర్కొన్నారు. బంగ్లాదేశ్ జలాల్లోకి ప్రవేశించిన ఐఎస్ సాగర్‌కు బంగ్లాదేశ్ నౌకాదళానికి చెందిన బీఎన్ఎస్ అలీ హైదర్ ఎఫ్--17 నౌక ఘన స్వాగతం పలికింది. అనంతరం ఆ నౌకను చిట్టగాంగ్ నౌకాశ్రయానికి ఎస్కార్ట్ చేస్తూ తీసుకెళ్లారు. ఈ పర్యటన ద్వారా రెండు దేశాల నౌకాదళాల మధ్య సమన్వయం, సముద్ర భద్రతా సహకారం మరింత బలపడుతుందని అధికారులు అభిప్రాయపడ్డారు. ప్రాంతీయ భద్రత, సముద్ర మార్గాల రక్షణలో భారత్--బంగ్లాదేశ్ భాగస్వామ్యం కీలకంగా మారుతోందని విశ్లేషకులు చెబుతున్నారు. ఈ నౌకా పర్యటన ఇరు దేశాల మధ్య దౌత్య, రక్షణ సంబంధాలను మరింత బలోపేతం చేసే అడుగుగా భావిస్తున్నారు. బంగాళాఖాత ప్రాంతంలో సహకారం పెంపు దిశగా ఇది ముఖ్యమైన పరిణామంగా నిలిచింది.

# మూసీ పునర్జీవం పనులకు వేగం




(మొదటి పేజీ తరువాయి..)

పనులను వెంటనే ప్రారంభించాలని నిర్ణయించారు. ఈ ప్రాంతంలో ఎటువంటి ఆవాసాలు లేకపోవడంతో ప్రారంభ దశ పనులను వేగంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. మూసీ నదిలో నీటి నిల్వ పెంపుతో పాటు పర్యాటక రంగాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో రబ్బర్ డ్యామ్ నమూనాలను మంత్రులు పరిశీలించారు. అలాగే నదిలో వ్యర్థాల తొలగింపు, రివర్ బెడ్ ప్రొఫైలింగ్, వరద నియంత్రణ గోడలు, రోడ్ల నిర్మాణం, మురుగు కాలువలు, బ్యారేజీల ఏర్పాటు వంటి పనులను ప్రాధాన్యంగా చేపట్టాలని నిర్ణయించారు. నార్సింగి నుంచి గౌరెల్లి వరకు 55 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణాన్ని కూడా ప్రాజెక్టులో భాగంగా చేపట్టనున్నారు. 2026 ఆగస్టు నాటికి అన్ని అనుమతులు పూర్తి చేసి పనులు ప్రారంభించి, 2027 డిసెంబర్ నాటికి మొత్తం ప్రాజెక్టును పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఐఐటీ, జేఎన్‌టీయూ వంటి సాంకేతిక సంస్థల సహకారంతో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులు చేపట్టాలని మంత్రులు అధికారులకు సూచించారు. ఈ ప్రాజెక్టు హైదరాబాద్ నగర రూపురేఖలను మార్చడమే కాకుండా పర్యావరణ పరిరక్షణలో కూడా కీలక మైలురాయిగా నిలుస్తుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆశాభావం వ్యక్తం చేశారు.

# రిటైర్డ్ ఐపీఎస్ భార్య హత్య కేసులో సంచలనం

## పనిమనిషిపైనే హత్య ఆరోపణలు బంగారం, నగదుతో పరారైన నిందితులు దర్యాప్తును పర్యవేక్షించిన డీజీపీ



**హైదరాబాద్, మే 8 (మన ప్రజాగళం):**
హైదరాబాద్‌లో రిటైర్డ్ ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రే భార్య సునంద హత్య కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ కేసులో ఇంట్లో పనిచేస్తున్న నేపాల్‌కు చెందిన పనిమనిషి కల్పన ప్రధాన నిందితురాలిగా పోలీసులు గుర్తించారు. పోలీసుల వివరాల ప్రకారం.. కల్పన మరో ఇద్దరితో కలిసి ముందస్తు ప్రణాళిక ప్రకారమే ఈ హత్యకు పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. సునందను హత్య చేసిన అనంతరం ఇంట్లో ఉన్న బంగారం, నగదును బ్యాగుల్లో సర్దుకుని ముగ్గురు అక్కడి నుంచి పరారైనట్లు పోలీసులు వెల్లడించారు. ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. ఇంట్లోని సీసీటీవీ దృశ్యాలు, ఇతర సాంకేతిక ఆధారాల ఆధారంగా దర్యాప్తును వేగవంతం చేశారు. ఈ కేసు తీవ్ర సంచలనం రేపడంతో రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్, నగర పోలీసు కమిషనర్ సజ్జనార్ స్వయంగా ఘటనాస్థలాన్ని పరిశీలించారు. దర్యాప్తు పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించి కీలక ఆదేశాలు జారీ చేశారు. పరారీలో ఉన్న నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు. హత్యకు గల పూర్తి కారణాలు, దోపిడీకి సంబంధించిన వివరాలు దర్యాప్తులో వెలుగులోకి వచ్చే అవకాశముందని పేర్కొన్నారు.

# తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుకు మళ్లీ ఊపు

**ఆదిలాబాద్‌లో ప్రాజెక్టు పరిశీలన**

**కాంగ్రెస్ హయాంలో ప్రారంభమైన ప్రాజెక్టు**


**గ్రావిటీ ద్వారా నీటి తరలింపు లక్ష్యం**



**ఆదిలాబాద్, మే 8 (మన ప్రజాగళం):**
ఆదిలాబాద్ జిల్లాలోని తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును మంత్రి జూపల్లి కృష్ణారావు సహచర మంత్రి వివేక్ వెంకటస్వామితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులతో కలిసి ప్రాజెక్టు పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత--చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టులో భాగంగా తుమ్మిడిహెట్టి బరాజ్‌కు 2008లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి భూమిపూజ చేశారని మంత్రి గుర్తు చేశారు. రూ.38,500 కోట్ల అంచనా వ్యయంతో 16 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును ప్రారంభించారని తెలిపారు. ప్రాజెక్టు పరిధిలో 106 కిలోమీటర్ల కాల్వ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయగా, ఇప్పటికే 71.5 కిలోమీటర్ల మేర భూసేకరణ పూర్తయిందన్నారు. అలాగే 46 కిలోమీటర్ల కాల్వ నిర్మాణ పనులు కూడా పూర్తయ్యాయని వెల్లడించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పక్కనపెట్టి కాళేశ్వరం ప్రాజెక్టుపై దృష్టి పెట్టిందని మంత్రి విమర్శించారు. గ్రావిటీ ద్వారా తరలించాల్సిన నీటిని పంపుల ద్వారా ఎత్తిపోసే విధానంతో భారీ ఆర్థిక భారం పెరిగిందని అన్నారు. సిర్పూర్, ఆసిఫాబాద్, బెల్లంపల్లి, చెన్నూరు నియోజకవర్గాల రైతులకు ప్రయోజనం చేకూర్చేందుకు తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును పునరుద్ధరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారని తెలిపారు. మహారాష్ట్ర ప్రభుత్వంతో త్వరలో చర్చలు జరిపి ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. భూములు కోల్పోయే రైతులకు తగిన పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మేడిగడ్డ ప్రాజెక్టు పిల్లర్లు కుంగిపోవడంతో ఆ నీటిని వినియోగించుకునే అవకాశం తగ్గిందని, తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ద్వారా గ్రావిటీ పద్ధతిలో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు నీటిని తరలిస్తామని మంత్రి వెల్లడించారు. ఒక్క యూనిట్ విద్యుత్ వినియోగం లేకుండా నీటి సరఫరా జరిగేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు.

# కాలుష్య రహిత హైదరాబాద్ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి..)



లబ్ధి అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని సీఎం తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో మైనారిటీల భాగస్వామ్యాన్ని మరింత పెంచేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా యువత ఉపాధిపై కూడా ముఖ్యమంత్రి మాట్లాడారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రభావంతో వైట్ కాలర్ ఉద్యోగాలకు ముప్పు పెరుగుతోందని, అందువల్ల నైపుణ్యాభివృద్ధిపై యువత దృష్టి పెట్టాలని సూచించారు. స్కిల్స్ యూనివర్సిటీలు, పాలిటెక్నిక్, శిక్షణా కేంద్రాల్లో చదివి ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. అమెరికా, మిడిల్ ఈస్ట్ దేశాలతో పాటు జపాన్, జర్మనీ, దక్షిణ కొరియా వంటి దేశాల్లో కూడా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని చెప్పారు. యువత ప్రపంచ స్థాయి నైపుణ్యాలు సంపాదించాలని సూచించారు. ఇరాన్ యుద్ధ పరిస్థితుల కారణంగా పెట్రోల్ ధరలు పెరిగాయని చూపిస్తూ హజ్ యాత్రికులపై ఒక్కొక్కరికి రూ.10 వేల అదనపు భారం మోపారని సీఎం పేర్కొన్నారు. ఈ భారాన్ని భరించలేని పరిస్థితి ఉన్నందున 7 వేల మంది హాజీలపై పడిన అదనపు వ్యయాన్ని ప్రభుత్వం భరిస్తుందని ప్రకటించారు. గత ఏడాది హజ్ యాత్ర సందర్భంగా జరిగిన బస్సు ప్రమాదంలో 44 మంది మరణించిన విషయాన్ని గుర్తుచేసిన ముఖ్యమంత్రి, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున పరిహారం అందించిందని తెలిపారు. మైనారిటీల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

# ప్రధాని పర్యటనకు విస్తృత ఏర్పాట్లు

(మొదటి పేజీ తరువాయి..)



క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహిస్తున్నాయి. రహదారుల పరిశుభ్రత, భద్రతా తనిఖీలు, ట్రాఫిక్ నిర్వహణ అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు అధికారులు తెలిపారు. ప్రధాని ప్రయాణ మార్గాల్లో రూట్ శానిటైజేషన్ చర్యలు కొనసాగుతున్నాయి. భద్రతా సంస్థలు ప్రతి ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నాయి. విభిన్న శాఖల మధ్య సమన్వయంతో ప్రధాని పర్యటన సాఫీగా జరిగేలా చర్యలు చేపడుతున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్, భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. ప్రధాని పర్యటన సందర్భంగా భద్రత, ప్రజాసౌకర్యాలు, రవాణా అంశాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోందని అధికారులు పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వ శాఖలు సమిష్టిగా పనిచేస్తూ పర్యటన విజయవంతం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నాయి.

# టీఎంసీ పాలనకు ముగింపు

**కొల్‌కతా, మే 8 (మన ప్రజాగళం):**
తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీని ఆమె సొంత నియోజకవర్గంలోనే బీజేపీ నాయకుడు సువేందు అధికారి ఓడించారని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. శుక్రవారం బెంగాల్ రాజకీయాలపై స్పందించిన ఆయన రాష్ట్రంలో అరాచక పాలనకు ప్రజలు ముగింపు పలికారని వ్యాఖ్యానించారు. బెంగాల్ గత ఐదు దశాబ్దాలుగా ప్రజాస్వామ్య క్షీణత, శాంతిభద్రతల పతనంతో తీవ్ర సమస్యలను ఎదుర్కొందని అమిత్ షా అన్నారు. ఇప్పుడు టీఎంసీ ఓటమితో రాష్ట్రంలో కొత్త రాజకీయ మార్పుకు శ్రీకారం చుట్టబడిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో బీజేపీ అద్భుత విజయాన్ని సాధించిందని ఆయన తెలిపారు. ఈ విజయం అసాధారణమని, బెంగాల్ చరిత్రలోనే ఇది కీలక మలుపుగా నిలుస్తుందని అభివర్ణించారు. ఎన్నికల ప్రచారం సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే బాధ్యత ఇప్పుడు బీజేపీపై ఉందని స్పష్టం చేశారు. బెంగాల్ అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని అమిత్ షా తెలిపారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేస్తామని, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తామని అన్నారు. ఎన్నికల ప్రక్రియను శాంతియుతంగా నిర్వహించిన ఎన్నికల సంఘం, భద్రతా దళాలు, రాష్ట్ర అధికారులను ఆయన అభినందించారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి అందరూ సమిష్టిగా పనిచేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీపై కూడా అమిత్ షా విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ వరుస ఎన్నికల్లో ఓటములు చవిచూస్తోందని, ఎందుకు ఓడిపోతున్నామో ఆ పార్టీ ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. ఆత్మపరిశీలన చేసుకోని నాయకులు ఎప్పటికీ నిజమైన విజయాన్ని సాధించలేరని అమిత్ షా వ్యాఖ్యానించారు. దేశ రాజకీయాల్లో మార్పులను అర్థం చేసుకుని ప్రజల విశ్వాసం పొందేందుకు పార్టీలన్నీ కృషి చేయాలని సూచించారు.

# హంతా వైరస్‌పై ప్రపంచం అప్రమత్తం

(మొదటి పేజీ తరువాయి..)

ఉన్నట్లు అధికారులు తెలిపారు. వైరస్ బయటపడకముందే కొందరు ప్రయాణికులు వివిధ దేశాలకు వెళ్లిపోవడంతో ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య సంస్థలు కాంటాక్ట్ ట్రేసింగ్ చేపట్టాయి. హంతా వైరస్ సాధారణంగా ఎలుకల మూత్రం, లాలాజలం, విసర్జన ద్వారా వ్యాపిస్తుందని నిపుణులు చెబుతున్నారు. అయితే ఈ ఘటనలో గుర్తించిన "ఆండీస్" రకం వైరస్ వ్యక్తి నుంచి వ్యక్తికి కూడా వ్యాపించే అవకాశం ఉండటంతో ఆందోళనలు పెరిగాయి. అయినప్పటికీ సాధారణ ప్రజలకు ప్రస్తుతం ముప్పు తక్కువగానే ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ స్పష్టం చేసింది. వైరస్ నియంత్రణకు ప్రపంచ ఆరోగ్య సంస్థ వివిధ దేశాలతో కలిసి పనిచేస్తోంది. బాధితులతో సన్నిహితంగా మెలిగిన వారిని గుర్తించి వైద్య పర్యవేక్షణలో ఉంచుతున్నారు. క్రూయిజ్ షిప్‌ను ప్రత్యేక నియంత్రణలో ఉంచి వైద్య బృందాలు పర్యవేక్షిస్తున్నాయి. హంతా వైరస్ లక్షణాలు మొదట జ్వరం, శరీర నొప్పులు, అలసట రూపంలో కనిపించి తర్వాత తీవ్రమైన శ్వాసకోశ సమస్యలకు దారితీయవచ్చని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం దీనికి ప్రత్యేక వ్యాక్సిన్ లేకపోవడంతో ముందస్తు జాగ్రత్తలే కీలకమని ఆరోగ్య సంస్థలు సూచిస్తున్నాయి.

# రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయి

(మొదటి పేజీ తరువాయి..)

రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా వరుసగా జరుగుతున్న నేర ఘటనలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పోలీస్ యంత్రాంగాన్ని రాజకీయ కక్షసాధింపులకు, ప్రతిపక్ష నాయకులను వేధించడానికి వినియోగిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. ప్రజల భద్రత, రక్షణ పూర్తిగా నిర్లక్ష్యానికి గురవుతోందని అన్నారు. శాంతిభద్రతల పరిస్థితిపై బీఆర్ఎస్ ప్రతినిధి బృందం డీజీపీని కలిసి ఫిర్యాదు చేస్తున్న సమయంలోనే హైదరాబాద్ ప్రశాసన్ నగర్‌లో రిటైర్డ్ డీజీ ర్యాంక్ ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రాయ్ భార్య హత్యకు గురవడం దిగ్భ్రాంతికరమని పేర్కొన్నారు. అదే విధంగా సికింద్రాబాద్‌లో నడిరోడ్డుపై యువకుడిని కత్తితో పొడిచి చంపిన ఘటన ప్రజల్లో భయాందోళనలు పెంచిందని అన్నారు. ఇటువంటి సంఘటనలు రాష్ట్రంలో పెరుగుతున్న అభద్రతా పరిస్థితులకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. నేరాల నియంత్రణ, ప్రజా భద్రతపై దృష్టి పెట్టాల్సిన పోలీస్, ఇంటెలిజెన్స్ వ్యవస్థలను ప్రభుత్వం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వాన్ని విమర్శించే సోషల్ మీడియా వేదికలపై కేసులు పెట్టడానికి వినియోగిస్తోందని ఆరోపించారు.

పోలీస్ వ్యవస్థను రాజకీయ అవసరాలకు వాడుకోవడం వల్లే శాంతిభద్రతలు కుప్పకూలాయని కేటీఆర్ అన్నారు. మహిళలపై నేరాలు, సైబర్ నేరాలు రాష్ట్రంలో భారీగా పెరిగాయని తాజా ఎన్‌సీఆర్‌బీ నివేదికలను ప్రస్తావించారు. హోంశాఖను కూడా తన వద్దే ఉంచుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజల ప్రాణాలు, ఆస్తులను కాపాడటంలో విఫలమయ్యారని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే రాజకీయ వేధింపులు ఆపి పోలీసింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల్లో భరోసా కల్పించేలా పోలీసులు వృత్తిపరంగా పనిచేసే పరిస్థితులు కల్పించాలని కేటీఆర్ ప్రభుత్వాన్ని కోరారు.

# సంపాదకీయం

## తమిళనాడులో రాజకీయ సంచలనం

డీఎంకే--ఏఐఏడీఎంకే కలయికపై జోరుగా ప్రచారం
టీవీకే ప్రభుత్వ ఏర్పాటుకు విజయ్ ప్రయత్నాలు
"డీఎంకే--ఏఐఏడీఎంకే కలిస్తే 107 మంది ఎమ్మెల్యేల రాజీనామా"
రాష్ట్ర రాజకీయాల్లో వేడెక్కిన అధికార పోరు



తమిళనాడు రాజకీయాలు ఒక్కసారిగా ఉత్కంఠభరితంగా మారాయి. ప్రభుత్వం ఏర్పాటుపై ఇంకా స్పష్టత రాకపోవడంతో రాష్ట్రంలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. టీవీకే ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేయాలని విజయ్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నప్పటికీ, ఇతర పార్టీల నుంచి పూర్తి స్థాయి మద్దతు మాత్రం లభించడం లేదు. దీంతో రాష్ట్ర రాజకీయాల్లో కొత్త కూటముల చర్చ మొదలైంది. ప్రస్తుతం రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు వేర్వేరు కూటముల్లో కొనసాగుతున్నాయి. కొన్ని పార్టీలు డీఎంకేతో, మరికొన్ని ఏఐఏడీఎంకేతో చేతులు కలిపాయి. ఇప్పుడు టీవీకేకు మద్దతు ఇవ్వాలంటే ఆయా కూటములను విడిచిపెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాజకీయంగా ఇది ప్రమాదకరమవుతుందనే భావనతో చాలా పార్టీలు వెనక్కి తగ్గుతున్నట్లు సమాచారం. దీంతో విజయ్ ప్రభుత్వ ఏర్పాటుపై అనిశ్చితి నెలకొంది.
ఇదే సమయంలో తమిళనాడులో బద్ధ శత్రువులుగా భావించే డీఎంకే, ఏఐఏడీఎంకే కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశాలపై జోరుగా ప్రచారం సాగుతోంది. ఈ అంశంపై స్పందించిన విజయ్.. ఒకవేళ ఈ రెండు పార్టీలు కలిసి అధికారంలోకి వస్తే టీవీకే తరఫున గెలిచిన 107 మంది ఎమ్మెల్యేలు రాజీనామా చేస్తారని హెచ్చరించారు. విజయ్ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో సంచలనంగా మారాయి. మొదట్లో టీవీకే ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పాటుపై డీఎంకే, ఏఐఏడీఎంకే సానుకూలంగా స్పందించినట్లు ప్రచారం జరిగింది. కానీ పరిస్థితులు మారడంతో ఇప్పుడు రెండు పార్టీలు కొత్త రాజకీయ వ్యూహాలపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. దీంతో తమిళనాడు రాజకీయాలు మరింత ఆసక్తికరంగా మారాయి.అయితే ఏఐఏడీఎంకేతో పొత్తు వార్తలను డీఎంకే ఖండించింది. పార్టీ అధికార ప్రతినిధి టీకేఎస్ ఎలంగోవన్ మాట్లాడుతూ ఈ ప్రచారంలో నిజం లేదన్నారు. గవర్నర్ విజయ్ పార్టీకి ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు ఈ నెల 10 వరకు గడువు ఇచ్చారని, ఆ తర్వాత పరిస్థితులను బట్టి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఇక డీఎంకే--ఏఐఏడీఎంకే పొత్తు అనైతికమని కాంగ్రెస్ పార్టీ తీవ్ర విమర్శలు చేసింది. దీంతో తమిళనాడులో అధికార పోరు మరింత వేడెక్కింది. ఇప్పుడు రాష్ట్ర ప్రజల దృష్టంతా ఒక్కటే.. విజయ్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తారా? లేక డీఎంకే--ఏఐఏడీఎంకే కొత్త కూటమి అధికారంలోకి వస్తుందా? అన్నదానిపై నిలిచింది.


# రైతుల కోసం పాదయాత్ర చేస్తాం

- మహబూబ్‌నగర్‌లో రైతులతో శ్రీనివాస్ గౌడ్ భేటీ
- ప్రతి గింజను ప్రభుత్వం కొనాలని డిమాండ్
- కాంగ్రెస్ రైతులను మోసం చేసిందని ఆరోపణ



**మహబూబ్‌నగర్, మే 8(మన ప్రజాగళం)**

రైతుల్లో భరోసా నింపేందుకు త్వరలో పాదయాత్ర చేపడతామని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ప్రకటించారు. మహబూబ్‌నగర్ మండల పరిధిలోని రాంరెడ్డిగూడెం మిల్లు వద్ద వడ్లు అమ్మకం కోసం వాహనాల్లో సంచులు పెట్టుకొని ఎదురు చూస్తున్న రైతులతో ఆయన మాట్లాడారు. రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. రైతుల సమస్యలపై పార్టీ ముఖ్య నాయకులతో సమావేశమై త్వరలోనే పాదయాత్రకు సంబంధించిన ప్రణాళిక విడుదల చేస్తామని తెలిపారు. పాదయాత్ర ద్వారా ప్రతి రైతును కలుసుకుని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు చేసిన అన్యాయాన్ని వివరిస్తామని చెప్పారు. రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వాలని, సకాలంలో యూరియా, విద్యుత్ సరఫరా చేయాలని, రైతు బంధు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు. పంట కొనుగోలు సకాలంలో జరగకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేయాలని కూడా డిమాండ్ చేశారు. రైతు మరణిస్తే రైతు బీమా వెంటనే అందించాలని కోరారు. రైతుల సమస్యలను పట్టించుకోని ప్రభుత్వంపై ప్రజలతో కలిసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. బీఆర్ఎస్ వరంగల్ సభ ప్రకటన వచ్చిన వెంటనే ప్రభుత్వం పాత పద్ధతిలో పంట కొనుగోళ్లు ప్రారంభించిందని ఆరోపించారు. ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాల వల్ల మిల్లర్లు రైతుల నుంచి అధిక తరుగు తీసుకుంటున్నారని చెప్పారు. రెండు నుంచి మూడు కిలోల వరకు తరుగు తీస్తున్నట్లు రైతులు తనకు తెలిపారని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. మూడు సార్లు రైతు బంధు ఇవ్వలేదని, వ్యవసాయానికి సరిపడా కరెంటు, యూరియా అందించలేదని ఆరోపించారు. రైతులు కష్టపడి పంట పండించినా ప్రభుత్వం కొనుగోలు చేయడం లేదన్నారు. అరకొర కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. మిల్లుల వద్ద కూడా కొనుగోళ్లు సరిగా జరగడం లేదని చెప్పారు. ప్రైవేట్ వ్యాపారులు 40 కేజీలకు మూడు నుంచి నాలుగు కిలోల వరకు తరుగు తీస్తూ రైతులను నష్టపరుస్తున్నారని పేర్కొన్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కల్లాల వద్దే వడ్లు కొనుగోలు చేశామని, తడిసిన ధాన్యాన్ని కూడా తీసుకున్నామని గుర్తు చేశారు. రైతులకు సకాలంలో డబ్బులు చెల్లించామని తెలిపారు. ఇప్పుడు రైతు వారోత్సవాలు ఎందుకు నిర్వహిస్తున్నారో కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పాలని ప్రశ్నించారు. ప్రజా సమస్యలు పరిష్కరించకుండా నాయకులను డబ్బులతో కొనుగోలు చేయాలని ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు. రైతులు, ప్రజలు, విద్యార్థులను డబ్బులతో కొనలేరని స్పష్టం చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యపై పోరాడి ప్రభుత్వం మెడలు వంచేలా చేస్తామని శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు.



# మైనారిటీ విద్యార్థులకు ప్రత్యేక డిగ్రీ కళాశాలలు

- నైపుణ్యాభివృద్ధి, ఏఐ శిక్షణపై సీఎం రేవంత్ దృష్టి
- జీవనోపాధికి ఉపయోగపడే విద్య అందించాలని ఆదేశం
- మైనారిటీ సంక్షేమ శాఖపై సీఎం సమీక్ష



**హైదరాబాద్, మే 8 (మన ప్రజాగళం)**

మైనారిటీ విద్యార్థుల కోసం ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ కళాశాలల్లో నైపుణ్యాభివృద్ధి, కృత్రిమ మేధస్సు శిక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో మైనారిటీ సంక్షేమ శాఖపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి ఈ ఆదేశాలు జారీ చేశారు. సంప్రదాయ కోర్సులకు మాత్రమే పరిమితం కాకుండా విద్యార్థుల జీవనోపాధికి ఉపయోగపడే శిక్షణ అందించాలని పేర్కొన్నారు.బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు అందిస్తున్నట్లే ప్రతిభావంతులైన మైనారిటీ విద్యార్థులకు కూడా ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించాలని సీఎం సూచించారు. ఇందుకోసం ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించాలని అధికారులను ఆదేశించారు. గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3 పరీక్షల్లో ఎంపికైన మైనారిటీ అభ్యర్థుల్లో ఆసక్తి ఉన్న వారిని ఎంపిక చేసి మైనారిటీ సంక్షేమ శాఖలో బాధ్యతలు అప్పగించాలని సీఎం సూచించారు. శాఖ చేపట్టే కార్యక్రమాలపై పూర్తి అవగాహన కలిగేలా వారిని తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. విద్యార్థులకు ప్రోత్సాహక కార్యక్రమాల్లో గ్రూప్స్‌లో ఎంపికైన అభ్యర్థులు, క్రీడాకారులను ఆహ్వానించి విద్య, క్రీడల ప్రాధాన్యతను వివరించాలని సూచించారు. ఇమామ్‌లు, మౌజమ్‌లకు అందించే గౌరవ వేతనాలను క్రమం తప్పకుండా విడుదల చేయాలని అధికారులకు ఆదేశించారు.భూమి అందుబాటులో ఉన్న చోట ఖబర్‌స్తాన్‌లకు స్థలాలు కేటాయిస్తామని సీఎం తెలిపారు. డీజిల్, పెట్రోల్ ఆటోలను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చే రెట్రోఫిట్టింగ్ ప్రణాళిక ద్వారా ఆటోడ్రైవర్ల ఇంధన వ్యయాన్ని తగ్గించి వారి జీవన ప్రమాణాలు మెరుగుపరచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని పేర్కొన్నారు. మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టులో భాగంగా గుడి, మసీదు, చర్చి, గురుద్వారా నిర్మాణాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. భారత దేశ వైవిధ్య సంస్కృతిని, తెలంగాణ గంగా-జమునా తెహ్‌జీబ్ సంప్రదాయాన్ని ప్రతిబింబించేలా ఆ నిర్మాణాలు ఉండాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో మంత్రి మహ్మద్ అజహరుద్దీన్, ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.



# గంగ కత్వ కాలువ ఆధునీకరణకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

- జగ్గారెడ్డి చొరవతో రూ.42 కోట్లకు ఆమోదం
- 3 వేల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యం
- త్వరలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన



**సంగారెడ్డి, మే 8 (మన ప్రజాగళం)**

నిజాం కాలం నాటి గంగ కత్వ కాలువ ఆధునీకరణకు ఎట్టకేలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి చొరవతో ఈ ప్రాజెక్టుకు రూ.42 కోట్ల విడుదలకు ప్రభుత్వం సమ్మతి తెలిపింది. దశాబ్దాలుగా మరమ్మత్తులకు నోచుకోని గంగ కత్వ కాలువకు ఇప్పుడు మోక్షం లభించిందని స్థానిక రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సదాశివపేట మండలం సూరారం గ్రామం నుంచి ప్రారంభమయ్యే గంగ కత్వ కాలువ సుమారు 15 కిలోమీటర్ల పొడవునా 11 గ్రామాలను కలుపుతూ మాచిరెడ్డిపల్లి వరకు విస్తరించి ఉంది. ఈ కాలువ ఆధారంగా సుమారు 3 వేల ఎకరాల ఆయకట్టు సాగునీరు పొందుతోంది.గంగ కత్వ కాలువ ఆధునీకరణ కోసం జగ్గారెడ్డి రెండు నెలల క్రితం నీటి పారుదల శాఖ అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. వెంటనే కొత్త ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం నీటి పారుదల శాఖ అధికారులు రూ.42 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపగా తాజాగా వాటికి ఆమోదం లభించింది. ఈ నేపథ్యంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఉన్నతాధికారులతో జగ్గారెడ్డి సచివాలయంలో సమావేశమయ్యారు. కాలువ ఆధునీకరణ పనులపై సమగ్రంగా చర్చించారు.ఆధునీకరణ పనుల్లో భాగంగా కాలువకు లైనింగ్ పనులు చేపట్టనున్నారు. అవసరమైన చోట కొత్త వంతెనలు నిర్మించడంతో పాటు పాత వంతెనలకు మరమ్మత్తులు చేయనున్నారు. కాలువ పొడవునా తూములకు మరమ్మత్తులు చేపట్టి నీటి వృథాను తగ్గించేలా చర్యలు తీసుకోనున్నారు. గంగ కత్వ కాలువకు అనుబంధంగా 33 చెరువుల నుంచి ఫీడర్ చానెల్స్ ఉన్నాయని అధికారులు తెలిపారు. ఆధునీకరణ పూర్తయితే ఆయకట్టు రైతులకు మరింత సమర్థవంతంగా సాగునీరు అందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఈ పనులు ప్రారంభం కావడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. కాలువ మరమ్మత్తులు పూర్తయితే వ్యవసాయానికి ఎంతో మేలు జరుగుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా గంగ కత్వ కాలువ ఆధునీకరణ పనులకు శంకుస్థాపన నిర్వహించనున్నట్లు సమాచారం. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉందని నాయకులు పేర్కొన్నారు.

# నిరుద్యోగ యువత కోసం భారీ జాబ్ మేళా

- 5 వేలకుపైగా ఉద్యోగ అవకాశాలు
- మావలలో ఈ నెల 20న నిర్వహణ
- 50కి పైగా ప్రముఖ కంపెనీల భాగస్వామ్యం

**ఆదిలాబాద్, మే 8 (మన ప్రజాగళం)**

నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో జిల్లా యంత్రాంగం భారీ జాబ్ మేళాను నిర్వహించనుందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు.



ఇటీవల ఈ నెల 6న నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించడంతో అదే ఉత్సాహంతో మరో భారీ ఉపాధి మేళాను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.ఈ నెల 20న మావలలోని చిలుకూరి లక్ష్మీ గార్డెన్స్‌లో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కలెక్టర్ ప్రకటించారు. ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో 50కి పైగా ప్రముఖ కంపెనీలు పాల్గొననున్నాయని తెలిపారు. ఐటీ, సర్వీస్ సెక్టార్, అగ్రికల్చర్, మ్యానుఫ్యాక్చరింగ్, కాల్ సెంటర్స్ తదితర రంగాలకు చెందిన సంస్థలు ఈ మేళాలో ఉద్యోగ నియామకాలు చేపట్టనున్నాయని పేర్కొన్నారు. మొత్తం 5 వేలకుపైగా ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు.ఉద్యోగాలకు సంబంధించి అభ్యర్థుల వయోపరిమితిని సరళీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. 18 నుంచి 33 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న యువతీ యువకులు ఈ జాబ్ మేళాలో పాల్గొనవచ్చన్నారు. అర్హతలు, నైపుణ్యాలను బట్టి ఏడాదికి రూ.1.5 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు వేతన ప్యాకేజీలు లభించే అవకాశముందని చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు పోస్టర్లలో ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ముందుగానే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. బయోడేటా లేదా సీవీలతో నేరుగా ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు. జిల్లా యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మంచి ఉద్యోగాలు పొందాలని కలెక్టర్ రాజర్షి షా పిలుపునిచ్చారు. మరిన్ని వివరాల కోసం 9666612707, 7981255978 హెల్ప్‌లైన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

### మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియ

# పారదర్శకంగా నిర్వహించాలి...

-: ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి...

-: రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్...







**జగిత్యాల జిల్లా ప్రతినిధి, మే 8 (మన ప్రజాగళం)**

జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీట్ బజార్‌లో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వయోవృద్ధులు, వికలాంగులు, ట్రాన్స్ జెండర్ సాధికారిత శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్,జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.కొనుగోలు కేంద్రంలో రైతుల నుండి మొక్కజొన్న కొనుగోలు విధానం, తేమ శాతం పరీక్షలు, తూకం ప్రక్రియ, నిల్వలు, రవాణా తదితర అంశాలపై అధికారులు అందిస్తున్న సేవలను పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.రైతులు తీసుకువచ్చే మొక్కజొన్న కు సరైన ధర లభించేలా ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో పారదర్శకత పాటిస్తూ రైతులకు సమయానికి చెల్లింపులు జరగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని, టార్ఫాలిన్ కవర్లు అందుబాటులో ఉంచుకోవాలని నిర్వాహకులకు సూచించారు.ప్రకృతి రైతులపై కన్నెర్ర చేస్తే ప్రజా ప్రభుత్వం కడుపులో పెట్టుకుని భరోసా కల్పిస్తుందని అన్నారు.వర్షం ఏ సమయంలో వస్తుందో చెప్పలేని పరిస్థితి ఉన్నందున రైతులు, నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.ప్రజా ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రైతుల అభివృద్ధి, సంక్షేమం కోసం కట్టుబడి ఉందని, అకాల వర్షాల పట్ల రైతుల కోసం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని అన్నారు.జిల్లాలో అందరికి అందుబాటులో ఉంటానని ఏవైనా సమస్యలుంటే వెంటనే దృష్టికి తీసుకురావాలని అన్నారు.ఈ సందర్భంగా జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ.రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని కోరారు. పంట చేతికొచ్చే సమయానికి అకాల వర్షాల వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న నేపథ్యంలో నియోజకవర్గం ప్రజలకు అందుబాటులో ఉంటూ రైతులకు భరోసా కల్పిస్తానని అన్నారు. అదేవిధంగా కల్లాల్లో కుప్పలపై రాత్రి సమయాల్లో టార్ఫాలిన్ కప్పి ఉంచాలని అన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ. జిల్లాలో మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, నీడ, తూకం యంత్రాలు తదితర సౌకర్యాలు అందుబాటులో ఉంచామని చెప్పారు. అకాల వర్షాల వల్ల ఏర్పడిన రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.తడిసిన ధాన్యం తగిన విధంగా ఆరబెట్టాలని అన్నారు. టార్ఫాలిన్ కవర్లు అందుబాటులో ఉంచుకోవాలని నిర్వాహకులకు సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రకాష్, జగిత్యాల మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి, సంబంధిత శాఖల జిల్లా స్థాయి అధికారులు, మార్కెట్ కమిటీ చైర్మన్ లు, సభ్యులు, మార్కెట్ కమిటీ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, కౌన్సిలర్ లు, కొనుగోలు కేంద్ర సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి స్మగ్లర్లకు కఠిన శిక్ష పడేలా చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.రాజ మల్లారెడ్డికి వరంగల్ సీపీ అభినందనలు



**(మన ప్రజాగళం - వరంగల్):**

గంజాయి అక్రమ రవాణా కేసులో నిందితులకు కఠిన శిక్ష పడేలా కోర్టులో సమర్థవంతంగా వాదనలు వినిపించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.రాజ మల్లారెడ్డి గారిని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ మేరకు క్యాంపు కార్యాలయంలో ఆయనను శాలువాతో సత్కరించి, నగదు రివార్డును అందజేశారు.వంద కిలోల గంజాయి అక్రమ రవాణా కేసులో ఐదుగురు నిందితులకు 20 ఏళ్ల జైలు శిక్ష పడటంలో రాజ మల్లారెడ్డి కీలక పాత్ర పోషించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. పోలీసులు మరియు ప్రభుత్వ న్యాయవాదులు సమన్వయంతో పనిచేస్తే నిందితులకు తగిన శిక్ష పడుతుందని, తద్వారా సమాజంలో నేరాలు తగ్గుతాయని తెలిపారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన ప్రాసిక్యూటర్‌ను అభినందించడం ఇతర అధికారులకు స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు.

## గవర్నర్‌ను కలిసిన ఐఎఫ్ఎస్ అధికారులు

- లోక్ భవన్‌లో మర్యాదపూర్వక భేటీ
- ప్రియాంక వర్గీస్, స్నేహజ భేటీ
- పలు అంశాలపై చర్చించినట్లు సమాచారం



**హైదరాబాద్, మే 8 (మన ప్రజాగళం)**

తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను ఇద్దరు ఐఎఫ్ఎస్ అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని లోక్ భవన్‌లో ఈ భేటీ జరిగింది. చార్మినార్ సర్కిల్ ప్రధాన అటవీ సంరక్షణాధికారి, తెలంగాణ ఐఎఫ్ఎస్ అధికారుల సంఘం కార్యదర్శి ప్రియాంక వర్గీస్, విదేశాంగ శాఖ బ్రాంచ్ సెక్రటేరియట్ హెడ్, ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి స్నేహజ గవర్నర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.ఈ సందర్భంగా పరిపాలన, శాఖల కార్యకలాపాలకు సంబంధించిన పలు అంశాలపై చర్చించినట్లు సమాచారం. రాష్ట్రంలో అటవీ సంరక్షణ, పాస్‌పోర్టు సేవల నిర్వహణ తదితర అంశాలు కూడా ప్రస్తావనకు వచ్చినట్లు తెలిసింది. గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అధికారులతో ఆత్మీయంగా మాట్లాడి వారి సేవలను అభినందించినట్లు రాజ్‌భవన్ వర్గాలు తెలిపాయి.

# ములుగులో అభివృద్ధి పనులపై సమీక్ష

అధికారులతో మంత్రి సీతక్క సమావేశం

పనుల పురోగతిపై శాఖల వారీగా చర్చ

సమన్వయంతో పనులు పూర్తి చేయాలని సూచన



**ములుగు, మే 8 (మన ప్రజాగళం)**

ములుగు జిల్లా అభివృద్ధి పనుల పురోగతిపై రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి వివిధ శాఖల అధికారులతో చర్చించారు. జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాల అమలు, గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై శాఖల వారీగా సమీక్ష చేపట్టారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు వేగంగా అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. ప్రజాపాలన లక్ష్యాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామస్థాయిలో సమస్యలు పెండింగ్‌లో లేకుండా వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత్ సహదేవరావు వివిధ శాఖల పనుల పురోగతిని మంత్రికి వివరించారు. జిల్లాలో జరుగుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ సీహెచ్ మహేందర్ జీ, ఆర్డీవో వెంకటేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు తదితరులు పాల్గొన్నారు.



# మేడ్చల్‌లో దిశ కమిటీ సమీక్ష సమావేశం

కేంద్ర పథకాలపై విస్తృత చర్చ

జిల్లా అభివృద్ధిపై అధికారులతో సమీక్ష

సమావేశానికి హాజరైన ఎమ్మెల్యేలు



**మేడ్చల్, మే 8 (మన ప్రజాగళం)**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ "దిశ" సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు, జిల్లా అభివృద్ధి అంశాలపై ఈ సమావేశంలో సమగ్ర సమీక్ష చేపట్టారు. ఈ సమావేశానికి ఎంపీ ఈటల రాజేందర్ అధ్యక్షత వహించారు. జిల్లాలో అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాల పురోగతితో పాటు పలు అభివృద్ధి అంశాలపై ఎమ్మెల్యేలు, వివిధ శాఖల అధికారులతో సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిపారు.సమావేశంలో మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి పాల్గొన్నారు. అలాగే ఎంఎంసీ కమిషనర్, జిల్లా అదనపు కలెక్టర్, వివిధ శాఖల ఉన్నతాధికారులు, దిశ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. జిల్లాలో ప్రజలకు కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు సమర్థవంతంగా చేరేలా చర్యలు తీసుకోవాలని సమావేశంలో సూచించారు. అభివృద్ధి పనుల్లో శాఖల మధ్య సమన్వయం మరింత పెంచాలని అధికారులను ఆదేశించారు. జిల్లా అభివృద్ధికి సంబంధించిన పలు సమస్యలు, మౌలిక సదుపాయాలు, సంక్షేమ కార్యక్రమాల అమలుపై కూడా సమావేశంలో చర్చ జరిగినట్లు సమాచారం.



## యువత లక్ష్య సాధనపై దృష్టి పెట్టాలి

**వరంగల్, మే 8 (మన ప్రజాగళం)**

యువత పట్టుదలతో కష్టపడి ఉద్యోగాలు సాధించాలని రాష్ట్ర మంత్రి కొండా సురేఖ అన్నారు. ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా వరంగల్‌లోని కాళోజీ కళాక్షేత్రంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ యువత తమ లక్ష్య సాధనపై పూర్తిగా దృష్టి పెట్టాలని సూచించారు. వయస్సుకు వచ్చిన తర్వాత తల్లిదండ్రులకు భారం కాకుండా సన్మార్గంలో నడుచుకుంటూ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. భవిష్యత్తుకు బలమైన పునాదులు వేసుకునేందుకు కష్టపడి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.యువత మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని మంత్రి సూచించారు. తమ ప్రతిభ, నైపుణ్యాలతో ఉన్నత ఉద్యోగాలు సాధించి జీవితంలో గొప్ప స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పలు కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. మెగా జాబ్ మేళాల ద్వారా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. భారీ సంఖ్యలో యువత జాబ్ మేళాకు హాజరై ఉద్యోగ అవకాశాలపై ఆసక్తి చూపించారు.



# కృష్ణానగర్‌లో ప్రీ మాన్సూన్ సన్నాహాల పరిశీలన

- నీటిమునిగే సమస్యపై జీహెచ్ఎంసీ ఫోకస్
- క్షేత్రస్థాయిలో కమిషనర్ తనిఖీలు
- డ్రైనేజీ పనులు వేగవంతం చేయాలని ఆదేశాలు



**హైదరాబాద్, మే 8 మన ప్రజాగళం న్యూస్ :** వర్షాకాలానికి ముందస్తు సన్నాహాల్లో భాగంగా జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ కృష్ణానగర్ ప్రాంతంలో క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. యూసుఫ్‌గూడ సర్కిల్ పరిధిలో ప్రతి మాన్సూన్ సమయంలో ఎదురయ్యే నీటిమునిగే సమస్యలపై అధికారులతో కలిసి సమీక్ష చేశారు. ఈ తనిఖీల్లో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ కూడా పాల్గొన్నారు. భారీగా మట్టి పేరుకుపోవడంతో మూసుకుపోయిన వర్షపు నీటి కాల్వలు, రోడ్ల పరిస్థితిని అధికారులు పరిశీలించారు. వర్షాల సమయంలో నీరు నిల్వ ఉండటంతో రహదారులు మునిగిపోవడం, ట్రాఫిక్ ఇబ్బందులు, పారిశుధ్య సమస్యలు ఎదురవుతున్నాయని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.దీంతో వెంటనే మురుగు కాల్వల శుభ్రపరిచే పనులు చేపట్టాలని జీహెచ్ఎంసీ కమిషనర్ అధికారులను ఆదేశించారు. డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చడంతో పాటు భవిష్యత్తులో నీటిమునిగే సమస్యలు రాకుండా శాశ్వత పరిష్కార చర్యలు రూపొందించాలని సూచించారు. ప్రస్తుతం కొనసాగుతున్న పౌరసేవల పనులు, ప్రీ మాన్సూన్ చర్యల పురోగతిని కూడా అధికారులు సమీక్షించారు. అన్ని పనులను అత్యవసర ప్రాతిపదికన నిర్ణీత గడువులో పూర్తి చేయాలని కమిషనర్ స్పష్టం చేశారు. జీహెచ్ఎంసీ చేపట్టిన ముందస్తు చర్యలను స్థానికులు అభినందించారు. ఈ చర్యలతో ప్రతి ఏడాది వర్షాకాలంలో ఎదురయ్యే సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# వరి కొనుగోలు కేంద్రాలపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

- రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు
- ధాన్యం తూకంలో ఆలస్యం వద్దని ఆదేశాలు
- అకాల వర్షాల నేపథ్యంలో అప్రమత్తం

**జగిత్యాల, మే 8 మన ప్రజాగళం న్యూస్ :** జగిత్యాల జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ శుక్రవారం ఆకస్మికంగా పరిశీలించారు. జగిత్యాల మండలం చల్‌గల్, మేడిపెల్లి మండలం పోరుమల్ల గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్రాలకు వచ్చిన వరి ధాన్యాన్ని మ్యాచర్ వచ్చిన వెంటనే తూకం వేసి ఆలస్యం లేకుండా మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా కొనుగోలు ప్రక్రియ నిర్వహించాలని సూచించారు. ధాన్యం తూకం, నిల్వ, రవాణా ప్రక్రియల్లో నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే ఆన్లైన్ డాటా ఎంట్రీ పూర్తి చేసి రైతుల ఖాతాల్లో సకాలంలో నగదు జమ అయ్యేలా చూడాలని ఆదేశించారు.రాష్ట్రంలో అకాల వర్షాల పరిస్థితులు ఉన్నందున కొనుగోలు కేంద్రాల్లో గన్ని సంచులు, టార్పాలిన్ కవర్లు తగినంతగా అందుబాటులో ఉంచుకోవాలని కలెక్టర్ సూచించారు. ధాన్యం తడవకుండా అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాల సమయంలో రైతులు చెట్ల కింద, విద్యుత్ స్తంభాల వద్ద నిలబడకుండా జాగ్రత్తలు పాటించేలా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీల్లో మండల తహసీల్దార్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# అదిలాబాద్ బీజేపీ ఎమ్మెల్యేకు నిరసన సెగ

- జొన్నల కొనుగోలు కేంద్రంలో ఉద్రిక్తత
- ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను నిలదీసిన రైతులు
- ప్రతి గింజను ప్రభుత్వమే కొనాలని డిమాండ్



**అదిలాబాద్, మే 8 మన ప్రజాగళం న్యూస్ :** అదిలాబాద్ జిల్లాలో బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌కు రైతుల నిరసన సెగ తగిలింది. బేల మండలంలోని మార్కెట్ యార్డులో జొన్నల కొనుగోలు కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు వచ్చిన ఎమ్మెల్యేను రైతులు అడ్డుకుని తమ సమస్యలు వివరించారు. శనగలతో పాటు జొన్నలను కూడా పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేసేలా హామీ ఇవ్వాలని ఎమ్మెల్యేపై ఒత్తిడి తెచ్చారు.కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, పంటకు సరైన మద్దతు ధరతో పాటు పూర్తి స్థాయిలో కొనుగోలు జరగాల్సిన అవసరం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో మార్కెట్ యార్డు వద్ద కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఎమ్మెల్యే పాయల్ శంకర్ హామీ ఇచ్చినట్లు సమాచారం. రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ ఘటనతో కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల ఆందోళనలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి

# కాగజ్‌నగర్‌లో ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ




**కాగజ్‌నగర్, మే 8 మన ప్రజాగళం న్యూస్ :** ప్రజాపాలన-- ప్రగతి ప్రణాళికలో భాగంగా కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్ పురపాలక సంఘం పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల రెండు పడకల గదుల పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేశారు. పేదలకు గృహ సౌకర్యం కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, సిర్పూర్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు. ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై వారు వివరించారు. ఇందిరమ్మ ఇళ్ల ద్వారా పేద కుటుంబాలకు శాశ్వత నివాస సౌకర్యం కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని అధికారులు తెలిపారు. లబ్ధిదారులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.



# రెడ్ క్రాస్ సభ్యత్వాలు భారీగా పెంచాలి

- సామాజిక సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి
- ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం
- రోజుకు 100 సభ్యత్వాలు నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశం



**గద్వాల, మే 8 మన ప్రజాగళం న్యూస్ :** సమాజ సేవలో కీలక పాత్ర పోషిస్తున్న రెడ్ క్రాస్ సంస్థలో సభ్యత్వాలను పెద్దఎత్తున పెంచాల్సిన అవసరం ఉందని జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని గద్వాలలోని రెడ్ క్రాస్ వయోవృద్ధుల డే కేర్ సెంటర్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొని పలు కీలక సూచనలు చేశారు. ప్రపంచ రెడ్ క్రాస్ సొసైటీ వ్యవస్థాపకుడు సర్ హెన్రీ డ్యూనాంట్ జయంతి సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ హెన్రీ డ్యూనాంట్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రెడ్ క్రాస్ సభ్యులతో సమావేశమై సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రకృతి వైపరీత్యాలు, అత్యవసర పరిస్థితులు, రక్తదానం, వైద్య సేవలు, సామాజిక సేవా కార్యక్రమాల్లో రెడ్ క్రాస్ కీలకంగా పనిచేస్తోందన్నారు. ఇలాంటి సేవా సంస్థలో ఎక్కువ మంది సభ్యులుగా చేరి సేవాభావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా మే 1 నుంచి 31వ తేదీ వరకు సభ్యత్వ నమోదు కార్యక్రమం కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు. సభ్యత్వ నమోదు కోసం ప్రత్యేకంగా ఆన్లైన్ విధానం అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. కలెక్టరేట్‌లో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించినట్లు పేర్కొన్నారు. రోజుకు కనీసం 100 మంది చొప్పున సభ్యత్వాలు నమోదు చేసి జిల్లాలో కనీసం 1500 సభ్యత్వాలు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. రెడ్ క్రాస్ శాశ్వత సభ్యత్వానికి కేవలం రూ.1000 మాత్రమే రుసుము ఉండటంతో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామస్థాయి వరకు ప్రచారం నిర్వహించి యువత, సేవాసంస్థలు, స్వచ్ఛంద కార్యకర్తలను సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని అన్నారు. సమాజంలో సేవాభావం పెరగాలంటే ఇలాంటి సంస్థలు బలోపేతం కావాలని కలెక్టర్ పేర్కొన్నారు. ముఖ్యంగా యువత సేవా కార్యక్రమాల్లో ముందుండాలని, రక్తదానం, వైద్య సహాయం, విపత్తుల సమయంలో సహాయక చర్యల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గద్వాల రెడ్ క్రాస్ వయోవృద్ధుల డే కేర్ సెంటర్‌ను పరిశీలించారు. అక్కడ వృద్ధులకు కల్పిస్తున్న వసతులు, వైద్య సేవలు, భోజన ఏర్పాట్ల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. వృద్ధులకు మరింత మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రెడ్ క్రాస్ సంస్థ చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేయాలని, సేవా కార్యక్రమాల్లో పారదర్శకతతో పాటు విస్తరణపై దృష్టి పెట్టాలని కలెక్టర్ తెలిపారు. భవిష్యత్తులో జిల్లాలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు అధికారులు, స్వచ్ఛంద సంస్థలు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ అయ్యపు రెడ్డి, వైస్ చైర్మన్ తాహిర్, సభ్యులు రమేష్, మోహన్‌రావు, అక్బర్ బాషా, ధనలక్ష్మి, గంగాధర్ గౌడ్, మహేష్ నాయుడు, సుధాకర్‌తో పాటు పలువురు అధికారులు, సేవా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఈవీఎం గోదామును పరిశీలించిన కలెక్టర్

- భద్రతా ఏర్పాట్లపై సమీక్ష
- సీసీ కెమెరాల పనితీరును తనిఖీ
- ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచన






**జగిత్యాల, మే 8 మన ప్రజాగళం న్యూస్ :** జగిత్యాల జిల్లా దరూర్ క్యాంప్‌లో ఈవీఎంలను భద్రపరిచిన గోదామును జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఈ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గోదాములోని ఈవీఎంల భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పనితీరు, ఇతర సాంకేతిక అంశాలను సమగ్రంగా పరిశీలించారు. ప్రతి నెలా ఈవీఎంల తనిఖీలు నిర్వహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. గోదాము వద్ద ఎలాంటి లోపాలు లేకుండా పటిష్టమైన భద్రత ఉండాలని సిబ్బందికి ఆదేశించారు. నిత్యం అప్రమత్తంగా పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. ఎన్నికల యంత్రాల భద్రత విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ పర్యవేక్షణలో అదనపు కలెక్టర్ రెవెన్యూ బీఎస్ లత, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు, కలెక్టరేట్ సిబ్బంది, జగిత్యాల అర్బన్ ఎమ్మార్వో రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# పశువుల ఆరోగ్యమే రైతుల ఆర్థికాభివృద్ధికి బలం

- కొత్తపల్లిలో పశు వైద్య శిబిరం
- ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహణ
- రైతులు సేవలను వినియోగించుకోవాలని కలెక్టర్ సూచన







**జనగామ, మే 8 మన ప్రజాగళం న్యూస్ :** పశువుల ఆరోగ్యం బాగుంటేనే రైతులు ఆర్థికంగా బలోపేతం అవుతారని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా జనగామ జిల్లాలోని ఘన్‌పూర్ స్టేషన్ మండలం కొత్తపల్లి గ్రామంలో నిర్వహించిన పశు ఆరోగ్య, సంతానోత్పత్తి శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ శిబిరాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించి దూడలు, గొర్రెలు, మేకలకు నులిపురుగుల నివారణ మందులు వేయించారు. అనంతరం రైతులకు ఖనిజ మిశ్రమాన్ని పంపిణీ చేశారు. పశువుల ఆరోగ్య పరిరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ శిబిరంలో మొత్తం 85 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్స అందించారు. దాదాపు 40 మంది రైతులు పాల్గొని పశు సంవర్ధక సేవలను వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పశుసంవర్ధక రంగం గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలాంటిదని పేర్కొన్నారు. పశువులకు సమయానికి టీకాలు వేయించడం, పోషకాహారం అందించడం, పరిశుభ్రత పాటించడం వంటి అంశాలపై రైతులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పశువుల్లో వ్యాధుల లక్షణాలు కనిపించిన వెంటనే సమీప పశు వైద్య అధికారులను సంప్రదించాలని రైతులకు సూచించారు. సంతానోత్పత్తి సేవలను సద్వినియోగం చేసుకుని పాల ఉత్పత్తి, పశుసంపదను పెంచుకోవాలని కోరారు. పశుసంవర్ధక రంగ అభివృద్ధికి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని, రైతులు వాటిని పూర్తిగా వినియోగించుకోవాలని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ అధికారులు, వైద్య సిబ్బంది, గోపాలమిత్రలు, పారావెట్స్ పాల్గొన్నారు.

# సుజాతనగర్ పీహెచ్‌సీని తనిఖీ చేసిన కలెక్టర్

- వైద్య సేవలపై సమగ్ర పరిశీలన
- మందుల నిల్వలు, ల్యాబ్ సేవల తనిఖీ
- పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశం



**భద్రాద్రి కొత్తగూడెం, మే 8 మన ప్రజాగళం న్యూస్ :** సుజాతనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ ఐఏఎస్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలను సమగ్రంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. తనిఖీల్లో భాగంగా ఔట్‌పేషెంట్, ఇన్‌పేషెంట్ విభాగాలు, మందుల గది, సిబ్బంది హాజరు నమోదు పత్రాలు, ఔట్‌పేషెంట్ రిజిస్టర్‌ను కలెక్టర్ పరిశీలించారు. రోజువారీగా ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య, నమోదవుతున్న కేసులు, అందిస్తున్న వైద్య సేవల వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. రక్తపరీక్షలు, ఇతర నిర్ధారణ సేవలు, ల్యాబ్ పరిస్థితి, పరీక్షల ఫలితాల అందజేత విధానంపై ఆరా తీశారు. మందుల నిల్వ గదిని పరిశీలించి అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయా లేదా అని తనిఖీ చేశారు. స్టాక్ రికార్డుల నిర్వహణను కూడా పరిశీలించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వార్డులు, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాలను ఎప్పటికప్పుడు శుభ్రపరిచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రోగులకు పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని పేర్కొన్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఐఏఎస్ సూచించారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. ఈ తనిఖీలో తహసీల్దార్ కృష్ణప్రసాద్, ఎంపీడీవో భారతి, మెడికల్ అధికారి డాక్టర్ రమేష్, నర్సింగ్ సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి

- పదోన్నతి పొందిన అధికారులకు సీపీ సూచన
- ఏఎస్సై నుంచి ఎస్ఐలుగా పదోన్నతి
- ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని పిలుపు





**వరంగల్, మే 8 మన ప్రజాగళం న్యూస్ :** ఉద్యోగంలో స్థాయి పెరిగిన కొద్దీ బాధ్యతలు కూడా పెరుగుతాయని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ఐపీఎస్ అన్నారు. ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించే దిశగా అధికారులు కృషి చేయాలని సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇటీవల ఏఎస్సై స్థాయి నుంచి సబ్ ఇన్‌స్పెక్టర్లుగా పదోన్నతి పొందిన 25 మంది అధికారులు శుక్రవారం పోలీస్ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు సీపీకి పూల మొక్కను అందజేశారు. అనంతరం సీపీ సన్‌ప్రీత్ సింగ్ చేతుల మీదుగా పదోన్నతి పొందిన అధికారుల భుజాలపై ఎస్ఐ నక్షత్ర చిహ్నాలను అలంకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదోన్నతులు కేవలం హోదా పెరుగుదల మాత్రమే కాకుండా ప్రజల పట్ల మరింత బాధ్యతతో పనిచేసే అవకాశం అని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను సానుభూతితో వినాలని, చట్టపరంగా వేగవంతమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీస్ శాఖ ప్రతిష్టను పెంచే విధంగా విధులు నిర్వర్తించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండే పోలీసింగ్ విధానాన్ని అమలు చేయాలని సీపీ తెలిపారు. బాధితులకు తక్షణ సహాయం అందించడంతో పాటు శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి అధికారి కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. విధుల్లో క్రమశిక్షణ, నిజాయితీ, నిబద్ధతతో పనిచేయాలని సీపీ సూచించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ మెరుగైన సేవలు అందించాలని పదోన్నతి పొందిన అధికారులకు అభినందనలు తెలిపారు.

# రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు చేయాలి

- కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్
- తేమ పరీక్షలు, బస్తాల నిల్వల పరిశీలన
- రైతులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశం





**జనగామ, మే 8 మన ప్రజాగళం న్యూస్ :** రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు వేగవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కొనుగోలు కేంద్ర నిర్వాహకులను ఆదేశించారు. జనగామ జిల్లా చిల్పూర్ మండలంలోని చిన్న పెండ్యాల గ్రామ పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. వడ్ల నాణ్యత, తేమ శాతం పరీక్షలు, బస్తాల నిల్వలు, హమాలీల సేవలు, రవాణా ఏర్పాట్లు, ట్రక్ షీట్లు, కాంటాలు తదితర అంశాలపై ఆరా తీశారు. రైతులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలపై కూడా పరిశీలించారు. రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని నాణ్యతా ప్రమాణాల ప్రకారం త్వరితగతిన కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం లేకుండా వెంటనే మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎండల తీవ్రత దృష్ట్యా రైతులకు తాగునీరు, నీడ వంటి సౌకర్యాలు తప్పనిసరిగా కల్పించాలని కలెక్టర్ పేర్కొన్నారు. కేంద్రాల వద్ద రైతులు ఇబ్బందులు పడకుండా అన్ని ఏర్పాట్లు ఉండాలని స్పష్టం చేశారు. లారీల ద్వారా ధాన్యం లోడింగ్, అన్‌లోడింగ్ ప్రక్రియలను సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ధాన్యం బస్తాలను వేగంగా లారీలలో నింపి, సంబంధిత మిల్లులకు వెంటనే తరలించాలని ఆదేశించారు. మిల్లుల వద్ద కూడా అన్‌లోడింగ్ ప్రక్రియ త్వరగా పూర్తయ్యేలా సమన్వయం చేయాలని తెలిపారు. ధాన్యం కొనుగోళ్లలో పూర్తి పారదర్శకత పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

# జనాభా గణనలో పాల్గొనడం ప్రతి ఒక్కరి బాధ్యత

- జనగణన అవగాహన ర్యాలీలో కలెక్టర్ రిజ్వాన్ బాషా
- మే 10 వరకు సెల్ఫ్ ఎన్యూమరేషన్ అవకాశం
- అభివృద్ధి ప్రణాళికలకు గణన కీలకమని వెల్లడి






**గద్వాల, మే 8 మన ప్రజాగళం న్యూస్ :** జనాభా గణనలో పాల్గొనడం ప్రతి పౌరుడి బాధ్యత అని జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఐఏఎస్ అన్నారు. పౌరుల ఉజ్వల భవిష్యత్తు, అభివృద్ధి ప్రణాళికలు, సంక్షేమ పథకాల అమలుకు జనాభా గణన ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. జనాభా గణన--2027 కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు శుక్రవారం కలెక్టరేట్ నుంచి కృష్ణవేణి చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఐడీఓసీ వద్ద జెండా ఊపి ర్యాలీని ప్రారంభించిన కలెక్టర్.. జనగణన ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు, యువత, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, ప్రజలు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలతో ర్యాలీలో పాల్గొన్నారు. కృష్ణవేణి చౌరస్తా వద్ద జరిగిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి పదేళ్లకు ఒకసారి నిర్వహించే జనాభా గణన దేశాభివృద్ధికి ఎంతో కీలకమని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారిగా నిర్వహిస్తున్న జనాభా గణనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. se.census.gov.in ద్వారా ఏప్రిల్ 26 నుంచి మే 10 వరకు సెల్ఫ్ ఎన్యూమరేషన్ చేసుకునే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎన్యూమరేటర్లు ఇంటింటికి వెళ్లి ముందుగా ఇండ్ల గణన నిర్వహిస్తారని, వచ్చే ఏడాది పూర్తి స్థాయి జనాభా గణన చేపడతారని వివరించారు. ప్రజలు నిర్దేశిత సమాచారాన్ని సరైన విధంగా అందించి అధికారులకు సహకరించాలని కోరారు. జిల్లాలోని అన్ని గ్రామాలు, పురపాలక సంఘాల్లో జనగణనపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ప్రజలు ఇచ్చే సమాచారాన్ని పూర్తిగా గోప్యంగా ఉంచుతామని, ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. సంబంధిత శాఖల అధికారులు బాధ్యతాయుతంగా పనిచేసి జనగణన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. దేశ అభివృద్ధి, సంక్షేమ పథకాల రూపకల్పనలో జనాభా గణన కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. అనంతరం ప్రపంచ తలసేమియా దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు వ్యాధి లక్షణాలు, చికిత్స, నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, సీపీఓ పాపయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, యువత, విద్యార్థులు, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# హెల్త్

## ఏసీ గదిలో ముప్పు తప్పదు

- నీరు తక్కువగా తాగితే డీహైడ్రేషన్ ప్రమాదం
- గంటల తరబడి ఏసీలో ఉంటే ఆరోగ్య సమస్యలు
- ఐటీ ఉద్యోగులు ఎక్కువగా జాగ్రత్తలు పాటించాలి

సాధారణంగా ఎండలో తిరిగేవారికే డీహైడ్రేషన్ సమస్య వస్తుందని చాలామంది భావిస్తుంటారు. కానీ చల్లని ఏసీ గదుల్లో గంటల తరబడి పనిచేసే ఉద్యోగుల్లో కూడా ఈ సమస్య తీవ్రంగా పెరుగుతోందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా ఐటీ, బ్యాంకింగ్, కార్పొరేట్ రంగాల్లో పనిచేసేవారు ఎక్కువసేపు ఏసీలో ఉండటం వల్ల శరీరంలో నీటి శాతం తగ్గిపోతుందని చెబుతున్నారు. ఏసీ గదుల్లో చల్లదనం ఉండటంతో దాహం ఎక్కువగా అనిపించదు. దీంతో చాలా మంది తగినంత నీరు తాగకుండా రోజంతా గడుపుతున్నారు. శరీరానికి అవసరమైన ద్రవాలు తగ్గిపోవడంతో అలసట, తలనొప్పి, నోరు ఎండిపోవడం, బలహీనత వంటి లక్షణాలు కనిపిస్తున్నాయని వైద్యులు పేర్కొంటున్నారు. ఇంకా కొందరిలో చర్మం పొడిబారడం, కళ్లలో మంట, శ్వాస సంబంధిత ఇబ్బందులు కూడా ఎదురవుతున్నాయి. ఏసీ గదుల్లో గాలి తేమ తగ్గిపోవడం వల్ల ఈ సమస్యలు మరింత పెరుగుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. రోజుకు కనీసం మూడు నుంచి నాలుగు లీటర్ల నీరు తాగాలని సూచిస్తున్నారు. ప్రతి గంటకు ఒకసారి లేచి కొద్దిసేపు నడవడం, నీరు తాగడం ఆరోగ్యానికి మంచిదని వైద్యులు అంటున్నారు. కొబ్బరి నీరు, పండ్ల రసాలు, మజ్జిగ వంటి ద్రవాలు తీసుకోవడం వల్ల శరీరంలో నీటి సమతుల్యత నిలుస్తుందని చెబుతున్నారు. ఏసీ ఉష్ణోగ్రతను చాలా తక్కువగా పెట్టకుండా 24 నుంచి 26 డిగ్రీల మధ్య ఉంచాలని సూచిస్తున్నారు. గదుల్లో కొంతసేపు సహజ గాలి వచ్చేలా చూడటం కూడా అవసరమని చెబుతున్నారు. ముఖ్యంగా రోజంతా కంప్యూటర్ల ముందు కూర్చునే ఉద్యోగులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.



## తీపి పదార్థాలు ఎక్కువగా తింటే తలనొప్పి వస్తుందా

- రక్తంలో చక్కెర స్థాయిల మార్పులతో ప్రభావం
- అధిక తీపి వల్ల అలసట, మైగ్రేన్ సమస్యలు
- మితంగా తీసుకోవాలని వైద్యుల సూచనలు



తీపి పదార్థాలు ఎక్కువగా తినడం వల్ల కొంతమందిలో తలనొప్పి వచ్చే అవకాశం ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా చాక్లెట్లు, స్వీట్లు, చక్కెర అధికంగా ఉన్న పానీయాలు ఎక్కువగా తీసుకున్నప్పుడు రక్తంలో చక్కెర స్థాయిలు ఒక్కసారిగా పెరిగి మళ్లీ తగ్గిపోవడం వల్ల ఈ సమస్య తలెత్తవచ్చని పేర్కొంటున్నారు. శరీరంలో చక్కెర స్థాయిలు వేగంగా మారినప్పుడు మెదడుపై ప్రభావం పడుతుందని నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల తలనొప్పి, అలసట, చిరాకు వంటి లక్షణాలు కనిపించే అవకాశం ఉందని వివరిస్తున్నారు. ముఖ్యంగా మైగ్రేన్ సమస్య ఉన్నవారిలో తీపి పదార్థాలు కొన్ని సందర్భాల్లో నొప్పిని మరింత పెంచవచ్చని చెబుతున్నారు. ఖాళీ కడుపుతో అధికంగా స్వీట్లు తినడం వల్ల కూడా ఇబ్బందులు రావచ్చని వైద్యులు హెచ్చరిస్తున్నారు. చక్కెర ఎక్కువగా ఉండే పదార్థాలు తాత్కాలికంగా శక్తి ఇచ్చినా, కొద్దిసేపటికే శరీరం నీరసంగా మారే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. దీంతో తలనొప్పితో పాటు బలహీనత కూడా అనిపించవచ్చని చెబుతున్నారు. తగినంత నీరు తాగకపోవడం, నిద్రలేమి, ఒత్తిడి వంటి కారణాలు కూడా తీపి పదార్థాలతో కలిసి తలనొప్పిని పెంచే అవకాశం ఉందని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. శరీరానికి అవసరమైనంత మాత్రమే చక్కెర తీసుకోవడం మంచిదని చెబుతున్నారు. పండ్లు, సహజ తీపి పదార్థాలు తీసుకోవడం ద్వారా ఆరోగ్యానికి మేలు జరుగుతుందని వైద్యులు సూచిస్తున్నారు. అధికంగా ప్రాసెస్ చేసిన స్వీట్లు, శీతల పానీయాలు తగ్గించడం మంచిదని చెబుతున్నారు. తలనొప్పి తరచుగా వస్తుంటే వైద్యులను సంప్రదించడం అవసరమని సూచిస్తున్నారు. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు పాటించడం ద్వారా తలనొప్పి వంటి సమస్యలను చాలావరకు తగ్గించవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు. మితమైన ఆహారం, సరైన నిద్ర, తగినంత నీరు ఆరోగ్యానికి ఎంతో అవసరమని చెబుతున్నారు.

## సన్‌ఫ్లవర్ గింజలతో ఆరోగ్యానికి బలం



సన్‌ఫ్లవర్ గింజలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే ఆహారంగా గుర్తింపు పొందుతున్నాయి. చిన్న పరిమాణంలో ఉన్నప్పటికీ ఇందులో విటమిన్లు, ఖనిజాలు, ఆరోగ్యకరమైన కొవ్వులు సమృద్ధిగా ఉంటాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. రోజువారీ ఆహారంలో మితంగా చేర్చుకుంటే అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చని సూచిస్తున్నారు. సన్‌ఫ్లవర్ గింజల్లో ఉండే విటమిన్-ఈ గుండె ఆరోగ్యాన్ని కాపాడడంలో సహాయపడుతుందని నిపుణులు చెబుతున్నారు. రక్తంలో చెడు కొలెస్ట్రాల్ తగ్గించడంలో ఇవి ఉపయోగపడతాయని పేర్కొంటున్నారు. గుండె సంబంధిత సమస్యల ప్రమాదాన్ని తగ్గించడంలో కూడా ఇవి దోహదపడవచ్చని వివరిస్తున్నారు. శరీరానికి అవసరమైన ప్రోటీన్, ఫైబర్ కూడా సన్‌ఫ్లవర్ గింజల్లో సమృద్ధిగా ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. దీంతో జీర్ణక్రియ మెరుగుపడటంతో పాటు ఎక్కువసేపు ఆకలి వేయకుండా ఉండే అవకాశం ఉంటుందని సూచిస్తున్నారు. బరువు నియంత్రణలో కూడా ఇవి కొంతవరకు సహాయపడవచ్చని పేర్కొంటున్నారు. చర్మం, జుట్టు ఆరోగ్యానికి కూడా సన్‌ఫ్లవర్ గింజలు ఉపయోగపడుతున్నాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు శరీర కణాలను రక్షించడంలో సహాయపడతాయని పేర్కొంటున్నారు. చర్మం కాంతివంతంగా ఉండేందుకు కూడా ఇవి మేలు చేస్తాయని చెబుతున్నారు. సన్‌ఫ్లవర్ గింజలను నేరుగా తినడంతో పాటు సలాడ్లు, ఉప్మా, పాలు, అల్పాహారాల్లో కలిపి తీసుకుంటున్నారు. అయితే ఉప్పు ఎక్కువగా కలిపిన గింజలను అధికంగా తినడం మంచిది కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మితంగా తీసుకుంటేనే పూర్తి ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయని సూచిస్తున్నారు. అలర్జీలు ఉన్నవారు లేదా ఇతర ఆరోగ్య సమస్యలతో బాధపడేవారు వైద్యుల సలహాతో మాత్రమే వీటిని తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. సరైన ఆహారపు అలవాట్లతో పాటు సన్‌ఫ్లవర్ గింజలను చేర్చుకుంటే ఆరోగ్యానికి మేలు జరుగుతుందని సూచిస్తున్నారు.

## క్యారమ్ బోర్డు పొడి ఆరోగ్యానికి హానికరమా



క్యారమ్ ఆటలో గుళికలు సులభంగా జారేందుకు ఉపయోగించే క్యారమ్ బోర్డు పొడి వినియోగం ప్రతి ఇంటిలో సాధారణంగా కనిపిస్తోంది. అయితే ఈ పొడిని అధికంగా ఉపయోగించడం లేదా తరచుగా పీల్చడం ఆరోగ్యంపై ప్రభావం చూపే అవకాశం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. క్యారమ్ పొడిలో సాధారణంగా సున్నితమైన ధూళి పదార్థాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇవి గాలిలో కలిసినప్పుడు ముక్కు ద్వారా శరీరంలోకి వెళ్లే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు. ఎక్కువసేపు దీనిని పీల్చడం వల్ల కొంతమందిలో తుమ్ములు, దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు రావచ్చని చెబుతున్నారు. పిల్లలు క్యారమ్ ఆడేటప్పుడు పొడిని చేతులతో తాకి కళ్లకు, ముక్కుకు పెట్టుకునే అవకాశం ఎక్కువగా ఉంటుందని వైద్యులు సూచిస్తున్నారు. దీంతో కళ్లలో మంట, అలర్జీ సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. ఆట పూర్తయ్యాక చేతులను శుభ్రంగా కడుక్కోవడం అవసరమని సూచిస్తున్నారు. కొన్ని రకాల నాసిరకం పొడుల్లో హానికర రసాయనాలు ఉండే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. అందువల్ల నాణ్యమైన ఉత్పత్తులను మాత్రమే ఉపయోగించడం మంచిదని పేర్కొంటున్నారు. అవసరానికి మించి పొడిని చల్లకుండా తక్కువ పరిమాణంలో వాడాలని సూచిస్తున్నారు. ఆట గది గాలి సరిగా వెళ్లేలా ఉండటం కూడా ముఖ్యమని వైద్యులు చెబుతున్నారు. మూసివేసిన గదుల్లో అధికంగా పొడి ఉపయోగిస్తే శ్వాసకోశ సమస్యలు పెరిగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. ఆస్తమా, అలర్జీ సమస్యలు ఉన్నవారు మరింత జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. క్యారమ్ ఆట ఆరోగ్యానికి మానసిక ఉల్లాసాన్ని ఇచ్చే మంచి వినోదంగా భావిస్తున్నప్పటికీ, పొడి వినియోగంలో సరైన జాగ్రత్తలు పాటించడం అవసరమని నిపుణులు చెబుతున్నారు. పరిశుభ్రత, మితమైన వినియోగం ద్వారా సమస్యలను చాలావరకు నివారించవచ్చని సూచిస్తున్నారు.

# బిజినెస్

## పసిడి ధరలు మళ్లీ పెరుగుదల..

### - కొనుగోలుదారులకు షాక్



**హైదరాబాద్, మే 8 మన ప్రజాగళం న్యూస్ :** అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల ప్రభావంతో దేశంలో బంగారం ధరలు మరోసారి పెరిగాయి. పెట్టుబడిదారులు సురక్షిత పెట్టుబడిగా పసిడిని ఎంచుకుంటుండటంతో ధరలు రోజురోజుకూ ఎగబాకుతున్నాయి. దీంతో బంగారం కొనుగోలు చేయాలనుకునే వారికి భారీ షాక్ తగులుతోంది. ఈరోజు దేశీయ మార్కెట్‌లో 24 క్యారెట్ల గ్రాము బంగారం ధర రూ.15,301కు చేరుకోగా, 22 క్యారెట్ల గ్రాము పసిడి ధర రూ.14,026గా నమోదైంది. అలాగే 18 క్యారెట్ల గ్రాము బంగారం ధర రూ.11,476 వద్ద కొనసాగుతోంది. దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,53,160గా ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,40,410గా ఉంది. ఆర్థిక రాజధాని ముంబైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,53,010కు చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,40,260గా నమోదైంది. తెలుగు రాష్ట్రాల్లో కూడా బంగారం ధరలు భారీగా పెరిగాయి. హైదరాబాద్, విజయవాడ నగరాల్లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,53,010గా ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,40,260కు చేరుకుంది. ఇక వెండి ధరల విషయానికి వస్తే.. ఢిల్లీ, ముంబై నగరాల్లో కిలో వెండి ధర రూ.100 పెరిగి రూ.2,70,100కు చేరుకుంది. అయితే హైదరాబాద్, విజయవాడలో మాత్రం కిలో వెండి ధర రూ.100 తగ్గి రూ.2,74,900గా నమోదైంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం అంతర్జాతీయ మార్కెట్‌లో కొనసాగుతున్న అనిశ్చిత పరిస్థితులు, ద్రవ్యోల్బణ భయాలు, డాలర్ మారకపు విలువల్లో మార్పులు బంగారం ధరల పెరుగుదలకు ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం ధరలు మరింత పెరిగే అవకాశముందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

## ధరల పెంపు ప్రకటనతో బ్రిటానియా షేర్ల పతనం



**ముంబై, మే 8 మన ప్రజాగళం న్యూస్ :** దేశీయ ఎఫ్ఎంసీజీ రంగంలోని ప్రముఖ సంస్థ బ్రిటానియా ఇండస్ట్రీస్ తమ ఉత్పత్తుల ధరలను పెంచనున్నట్లు ప్రకటించడంతో కంపెనీ షేర్లు భారీగా పతనమయ్యాయి. 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ధరల పెంపు అమలు చేయనున్నట్లు కంపెనీ మదుపర్లకు వెల్లడించింది. ఈ ప్రకటన తర్వాత మార్కెట్‌లో పెట్టుబడిదారులు అప్రమత్తం కావడంతో బ్రిటానియా షేర్లు దాదాపు 5 శాతం మేర పడిపోయాయి. ప్రస్తుతం కంపెనీ షేరు ధర 4.99 శాతం నష్టంతో రూ.5,524 వద్ద ట్రేడవుతోంది. ముడి సరుకుల ధరలు పెరగడం, ఉత్పత్తి వ్యయాలు అధికమవడం కారణంగానే ధరల పెంపు నిర్ణయం తీసుకున్నట్లు మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. అయితే మరోవైపు కంపెనీ ఆర్థిక ఫలితాలు మాత్రం బలంగా నమోదయ్యాయి. 2025-26 ఆర్థిక సంవత్సరం జనవరి-మార్చి త్రైమాసికంలో బ్రిటానియా నికర లాభం 21.2 శాతం పెరిగి రూ.678 కోట్లకు చేరినట్లు సంస్థ వెల్లడించింది. అంతేకాకుండా అమెరికా-ఇరాన్ యుద్ధ ప్రభావం తమ వ్యాపారంపై పెద్దగా ఉండదని కూడా కంపెనీ స్పష్టం చేసింది. షేర్ హోల్డర్లకు గుడ్‌న్యూస్ చెబుతూ ఈక్విటీ షేర్లపై రూ.90.50 డివిడెండ్ ప్రకటించింది. మొత్తం రూ.407.88 కోట్లను డివిడెండ్ రూపంలో పంపిణీ చేయనున్నట్లు తెలిపింది. ఇక మరో ప్రముఖ ఎఫ్ఎంసీజీ సంస్థ డాబర్ ఇండియా కూడా ఉత్పత్తుల ధరలను పెంచే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. ముడి పదార్థాల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో దాదాపు 4 శాతం వరకు ధరల పెంపు ఉండొచ్చని జాతీయ మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి.

## స్మార్ట్‌ఫోన్ ధరలకు బ్రేక్.. క్వాల్‌కామ్ కొత్త చిప్‌సెట్లు


**న్యూఢిల్లీ, మే 8 మన ప్రజాగళం న్యూస్ :** టెక్నాలజీ రంగ దిగ్గజం క్వాల్‌కామ్ మధ్యశ్రేణి, తక్కువ ధర స్మార్ట్‌ఫోన్ల కోసం కొత్త తరం చిప్‌సెట్లను విడుదల చేసింది. ఇటీవల స్మార్ట్‌ఫోన్ల ధరలు భారీగా పెరుగుతున్న నేపథ్యంలో ఈ కొత్త చిప్‌లు మార్కెట్‌లో ప్రాధాన్యం సంతరించుకున్నాయి. క్వాల్‌కామ్ విడుదల చేసిన స్నాప్‌డ్రాగన్ 6 జెన్ 5, స్నాప్‌డ్రాగన్ 4 జెన్ 5 చిప్‌సెట్లు మెరుగైన పనితీరు, ఎక్కువ బ్యాటరీ సామర్థ్యం, అధునాతన కనెక్టివిటీ సదుపాయాలను అందిస్తాయని సంస్థ తెలిపింది. ఈ చిప్‌సెట్ల ద్వారా అందుబాటు ధరల్లోనే కృత్రిమ మేధ సాంకేతికతను వినియోగించుకునే స్మార్ట్‌ఫోన్లు తయారు చేసే అవకాశం ఉంటుందని కంపెనీ వెల్లడించింది. క్వాల్‌కామ్ టెక్నాలజీస్ సీనియర్ ఉపాధ్యక్షుడు క్రిస్ పాట్రిక్ మాట్లాడుతూ.. ప్రస్తుతం చిప్‌ల సరఫరా పరిమితమవడం, పరికరాల తయారీ ఖర్చులు పెరగడం వల్ల మొబైల్ ధరలు అధికమవుతున్నాయని తెలిపారు. ఈ పరిస్థితుల్లో వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా తక్కువ ఖర్చుతో అధునాతన ఫీచర్లు అందించే చిప్‌సెట్లను రూపొందించినట్లు పేర్కొన్నారు.

## ఇక ఏటీఎం, యూపీఐ ద్వారా పీఎఫ్ నగదు ఉపసంహరణ




**న్యూఢిల్లీ, మే 8 మన ప్రజాగళం న్యూస్ :** దేశవ్యాప్తంగా కోట్లాది మంది ఉద్యోగులకు ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ కీలక శుభవార్త అందించింది. పీఎఫ్ నగదు ఉపసంహరణ ప్రక్రియను మరింత వేగవంతం, సులభతరం చేస్తూ 'ఈపీఎఫ్‌వో 3.0' వ్యవస్థను అమల్లోకి తీసుకురానుంది. ఈ కొత్త విధానంతో సభ్యులు తమ పీఎఫ్ ఖాతాలోని డబ్బులను ఇకపై ఏటీఎం కార్డు లేదా యూపీఐ ద్వారా నేరుగా పొందే అవకాశం కలగనుంది. ప్రస్తుతం పీఎఫ్ డబ్బులు ఖాతాలోకి రావడానికి వారం నుంచి పది రోజుల వరకు సమయం పడుతోంది. అయితే కొత్త సదుపాయం ద్వారా సభ్యులు తమ మొత్తం బ్యాలెన్స్‌లో గరిష్టంగా 50 శాతం వరకు తక్షణమే ఉపసంహరించుకునే అవకాశం ఉంటుంది. అత్యవసర వైద్య ఖర్చులు, కుటుంబ అవసరాల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండానే ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈపీఎఫ్‌వో సభ్యుల కోసం ప్రత్యేకంగా పీఎఫ్ ఏటీఎం కార్డులను జారీ చేయాలని సంస్థ యోచిస్తోంది. ఈ కార్డులు నేరుగా సభ్యుల పీఎఫ్ ఖాతాలకు అనుసంధానమై ఉంటాయి. అలాగే యూఏఎన్‌కు అనుసంధానించిన బ్యాంక్ ఖాతా ద్వారా యూపీఐ సేవలను ఉపయోగించుకునే విధంగా సాంకేతిక మార్పులు చేస్తున్నారు. మే నెలాఖరులోపు ఈ సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశముందని సమాచారం. అయితే ఈ డిజిటల్ సేవలను వినియోగించుకోవాలంటే కొన్ని అర్హతలు తప్పనిసరిగా ఉండాలి. సభ్యుడికి యాక్టివ్ యూఏఎన్ ఉండాలి. కేవైసీ ప్రక్రియ పూర్తై ఉండాలి. ఆధార్, పాన్ కార్డు, బ్యాంక్ ఖాతా వివరాలు, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ వంటి సమాచారం పీఎఫ్ ఖాతాతో అనుసంధానమై ఉండాలి. ఇక కేంద్ర కార్మిక శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఈపీఎఫ్‌వో రికార్డు స్థాయిలో 8.31 కోట్ల క్లెయిమ్‌లను పరిష్కరించింది. ఇందులో 71 శాతం అడ్వాన్స్ క్లెయిమ్‌లను కేవలం మూడు రోజుల్లోనే ఆటో విధానంలో క్లియర్ చేయడం విశేషంగా మారింది. అలాగే 1.59 కోట్ల మంది సభ్యులు యజమాని ప్రమేయం లేకుండానే తమ బ్యాంక్ వివరాలను స్వయంగా నవీకరించుకున్నట్లు వెల్లడించారు.

## ఏఐ ప్రభావం.. 1,100 మంది ఉద్యోగులకు క్లౌడ్‌ఫ్లేర్ షాక్




**మన ప్రజాగళం న్యూస్ :** ప్రపంచ ప్రఖ్యాత సైబర్ భద్రత సంస్థ క్లౌడ్‌ఫ్లేర్ భారీ ఉద్యోగ కోతలను ప్రకటించింది. కృత్రిమ మేధ ఆధారిత కొత్త సాంకేతిక యుగానికి అనుగుణంగా సంస్థను మారుస్తున్న నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా 1,100 మందికి పైగా ఉద్యోగులను తొలగిస్తున్నట్లు వెల్లడించింది. ఇది సంస్థ మొత్తం ఉద్యోగుల్లో దాదాపు 20 శాతానికి సమానమని సమాచారం. మొదటి త్రైమాసిక ఆర్థిక ఫలితాలను ప్రకటించిన అనంతరం ఉద్యోగులకు ఈ విషయాన్ని యాజమాన్యం తెలియజేసింది. అయితే ఇది ఖర్చులు తగ్గించేందుకు తీసుకున్న నిర్ణయం కాదని, భవిష్యత్తులో ఏఐ ఆధారిత వ్యవస్థలకు అనుగుణంగా సంస్థ నిర్మాణాన్ని మార్చే ప్రక్రియలో భాగమని క్లౌడ్‌ఫ్లేర్ సహ వ్యవస్థాపకులు మాథ్యూ ప్రిన్స్, మిషెల్ జాట్లిన్ స్పష్టం చేశారు. గత మూడు నెలల్లో కంపెనీలో ఏఐ వినియోగం 600 శాతానికి పైగా పెరిగిందని వారు వెల్లడించారు. ఇంజినీరింగ్, మానవ వనరులు, ఆర్థిక విభాగాలు సహా దాదాపు అన్ని విభాగాల్లో వేలాది ఏఐ ఏజెంట్ సెషన్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీంతో సంప్రదాయ పని విధానాల్లో మార్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ఉద్యోగుల్లో అనిశ్చితి పెరగకుండా ఉండేందుకు ఒకేసారి ఈ నిర్ణయం తీసుకున్నామని కంపెనీ వెల్లడించింది. తరచూ చిన్నచిన్న కోతలు విధించడం కంటే ఒకేసారి స్పష్టమైన నిర్ణయం తీసుకోవడమే మంచిదని భావించినట్లు తెలిపింది. భవిష్యత్తులో ఇలాంటి మరిన్ని ఉద్యోగ కోతలు ఉండవని కూడా యాజమాన్యం హామీ ఇచ్చింది. ఏఐ ఆధారిత ప్రపంచంలో ఒక ఆధునిక సంస్థ ఎలా పనిచేయాలనే దానిపై కొత్త ప్రమాణాలు సృష్టించడమే తమ లక్ష్యమని క్లౌడ్‌ఫ్లేర్ పేర్కొంది. అలాగే ఉద్యోగాలు కోల్పోయిన వారికి పరిశ్రమలోనే అత్యుత్తమ పరిహార ప్యాకేజీలు అందిస్తున్నట్లు వెల్లడించింది.

# జ్యోతి రాయ్ మెరుపులు..




బుల్లితెర నటి జ్యోతి రాయ్ మరోసారి తన గ్లామర్ ఫొటో షూట్‌తో సామాజిక మాధ్యమాల్లో సందడి చేస్తోంది. 'గుప్పెడంత మనసు' ధారావాహిక ద్వారా తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన ఈ అందాల నటి, ఇప్పుడు వెబ్ సిరీస్‌లు మరియు సినిమాలతో బిజీగా మారింది. నటనతో పాటు తన అందంతోనూ అభిమానులను ఆకట్టుకుంటున్న జ్యోతి రాయ్ తాజా ఫొటోలు ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి.తాజాగా పూల డిజైన్ గౌనులో జ్యోతి చేసిన ఫొటో షూట్ అభిమానులను కట్టిపడేస్తోంది. సహజమైన అందం, స్టైలిష్ లుక్‌తో ఆమె ఇచ్చిన పోజులు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ముఖ్యంగా చిరునవ్వుతో కనిపించిన ఆమె ఫొటోలకు అభిమానులు పెద్ద ఎత్తున స్పందిస్తున్నారు.

# 47లోనూ అదే అందం..



ఒకప్పుడు తెలుగు సినీ పరిశ్రమలో స్టార్ కథానాయికగా వెలుగొందిన భూమిక చావ్లా ఇప్పటికీ అదే అందం, ఫిట్‌నెస్‌తో అభిమానులను ఆకట్టుకుంటోంది. 47 ఏళ్ల వయసులోనూ ఎంతో యంగ్‌గా కనిపిస్తున్న భూమిక తాజాగా తన ఆరోగ్య రహస్యాలను, రోజువారీ జీవనశైలిని అభిమానులతో పంచుకుంది. ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆమె తన డైట్ ప్లాన్, ఫిట్‌నెస్ అలవాట్ల గురించి ఆసక్తికర విషయాలు వెల్లడించింది.'యువకుడు' సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన భూమిక, 'ఖుషీ', 'ఒక్కడు', 'సింహాద్రి', 'వాసు', 'మిస్సమ్మ' వంటి ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో నటించి ప్రత్యేక గుర్తింపు సంపాదించింది. పెళ్లి తర్వాత కొంతకాలం సినిమాలకు దూరమైన ఆమె, ఇప్పుడు మళ్లీ కీలక పాత్రలతో ప్రేక్షకుల ముందుకు వస్తోంది.తన అందం వెనుక ఎలాంటి ఖరీదైన డైట్‌లు లేదా కఠినమైన నియమాలు లేవని భూమిక తెలిపింది. తాను పూర్తిగా శాఖాహారినని, ఇంట్లో తయారుచేసిన సాధారణ ఆహారానికే ప్రాధాన్యం ఇస్తానని చెప్పింది. ఆహారంలో మసాలాలు చాలా తక్కువగా ఉంటాయని, ఏది తిన్నా మితంగా తినడమే తన ఆరోగ్య రహస్యమని వెల్లడించింది. ప్రతిరోజూ యోగా, వాకింగ్ తప్పకుండా చేస్తానని భూమిక చెప్పింది. మానసిక ప్రశాంతత కోసం యోగా ఎంతో ఉపయోగపడుతుందని, శరీరాన్ని ఫిట్‌గా ఉంచుకోవడానికి స్విమ్మింగ్ కూడా చేస్తానని తెలిపింది. ఎక్కువగా నీరు తాగడం, తాజా పండ్లు తీసుకోవడం తన అలవాటని పేర్కొంది.

# 'పెద్ది' సెట్స్‌లో చిరంజీవి సందడి




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న ప్రతిష్టాత్మక స్పోర్ట్స్ యాక్షన్ చిత్రం 'పెద్ది' షూటింగ్ ప్రస్తుతం చివరి దశకు చేరుకుంది. ఇప్పటికే ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్న వేళ.. తాజాగా మెగాస్టార్ చిరంజీవి స్వయంగా సినిమా సెట్స్‌కు వెళ్లి చిత్రబృందాన్ని ఉత్సాహపరిచారు. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.ఉత్తరాంధ్ర గ్రామీణ నేపథ్యంలో కుస్తీ క్రీడ ఆధారంగా రూపొందుతున్న ఈ సినిమాలో రామ్ చరణ్ పూర్తిగా భిన్నమైన పాత్రలో కనిపించనున్నాడు. ఇటీవల విడుదలైన 'పెద్ది పెహిల్వాన్' గ్లింప్స్‌కు ప్రేక్షకుల నుంచి అద్భుత స్పందన వచ్చిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో షూటింగ్ జరుగుతున్న ప్రదేశానికి చిరంజీవి వెళ్లి అక్కడి వాతావరణాన్ని దగ్గరుండి పరిశీలించారు. రామ్ చరణ్ లుక్, సెట్స్ నిర్మాణం, యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ విధానం చూసి చిరంజీవి ఎంతో ఆనందం వ్యక్తం చేసినట్లు సమాచారం.షూటింగ్ విరామ సమయంలో చిత్రబృందంతో చిరంజీవి సరదాగా ముచ్చటించారు. దర్శకుడు బుచ్చిబాబు సానా పనితీరును ప్రశంసిస్తూ సినిమా విజయం ఖాయమని నమ్మకం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. సెట్స్‌లో చిరంజీవి సందడి చేయడంతో యూనిట్ సభ్యుల్లో కొత్త ఉత్సాహం కనిపించింది. ఈ సందర్భంగా దర్శకుడు బుచ్చిబాబు తన సామాజిక మాధ్యమ ఖాతాలో వీడియోను పంచుకుంటూ.. "మెగాస్టార్ మా సెట్స్‌కు రావడం మా అదృష్టం. ఆయన మాటలు మాకు మరింత ప్రేరణ ఇచ్చాయి" అంటూ భావోద్వేగ వ్యాఖ్యలు చేశారు.ఈ చిత్రంలో బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తుండగా.. కన్నడ స్టార్ శివరాజ్ కుమార్, జగపతిబాబు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని భారీ నిర్మాణ విలువలతో తెరకెక్కిస్తున్నారు. గ్రామీణ భావోద్వేగాలు, కుస్తీ పోటీలు, మాస్ యాక్షన్ అంశాలతో రూపొందుతున్న ఈ సినిమా వచ్చే నెలలో ప్రపంచవ్యాప్తంగా విడుదలయ్యే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి.

## ఏఐ సినిమాలకు కొత్త నిబంధనలు

సినిమాల్లో కృత్రిమ మేధ వినియోగంపై గోల్డెన్ గ్లోబ్ అవార్డులు నిర్వాహకులు కీలక మార్గదర్శకాలను ప్రకటించారు. హాలీవుడ్‌లో రోజురోజుకీ పెరుగుతున్న ఏఐ ప్రభావం నేపథ్యంలో 2027 అవార్డుల కోసం ప్రత్యేక నిబంధనలను అమల్లోకి తీసుకొచ్చారు. ఇటీవల అకాడమీ అవార్డులు కూడా ఇలాంటి మార్గదర్శకాలను ప్రకటించగా.. ఇప్పుడు గోల్డెన్ గ్లోబ్స్ కూడా స్పష్టమైన విధానాన్ని వెల్లడించడం సినీ వర్గాల్లో చర్చనీయాంశమైంది.నిర్వాహకుల ప్రకటన ప్రకారం.. భవిష్యత్తులో అవార్డులకు పంపించే చిత్రాల్లో ఏఐ వినియోగం ఉండొచ్చని అంగీకరించినప్పటికీ, మానవ సృజనాత్మకతకే అత్యధిక ప్రాధాన్యం ఉంటుందని స్పష్టం చేశారు. కృత్రిమ మేధను పూర్తిగా నిషేధించకపోయినా.. దానిని కేవలం సహాయక సాధనంగా మాత్రమే ఉపయోగించాలని సూచించారు. ముఖ్యంగా నటీనటుల స్వరం, రూపం లేదా భావ వ్యక్తీకరణలను ఏఐ ద్వారా మార్చినట్లయితే.. ఆ విషయాన్ని తప్పనిసరిగా వెల్లడించాల్సి ఉంటుందని తెలిపారు.నటన విభాగాల్లో అవార్డుల ఎంపిక సమయంలో సహజ నటనకే ప్రాధాన్యం ఇస్తామని కమిటీ వెల్లడించింది. ఏఐ సహాయంతో నటనకు మెరుగులు చేర్చినా.. అసలు గుర్తింపు మాత్రం నటుడి ప్రతిభకే దక్కుతుందని స్పష్టం చేసింది. అలాగే అనుమతి లేకుండా ఎవరి స్వరం లేదా రూపాన్ని డిజిటల్ రూపంలో ఉపయోగించినా.. అలాంటి చిత్రాలను పరిగణనలోకి తీసుకోబోమని హెచ్చరించింది.ప్రస్తుతం హాలీవుడ్‌లో డీప్‌ఫేక్ సాంకేతికత, డిజిటల్ క్లోనింగ్‌పై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. కళాకారుల హక్కులు, మానవ సృజనాత్మకత భవిష్యత్తుపై ఆందోళనలు వ్యక్తమవుతున్న వేళ.. గోల్డెన్ గ్లోబ్స్ తీసుకున్నతాజా నిర్ణయం పరిశ్రమలో కీలక మార్పులకు అవకాశాలు కనిపిస్తున్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ఐపీఎల్ ఆటగాళ్లకు బీసీసీఐ హెచ్చరిక..

### - హనీ ట్రాప్ ప్రమాదంపై అప్రమత్తం

**ముంబై, మే 8 మన ప్రజాగళం న్యూస్ :** ఐపీఎల్ 2026 సీజన్ నేపథ్యంలో ఆటగాళ్లు, జట్టు సిబ్బందికి భారత క్రికెట్ నియంత్రణ మండలి కీలక హెచ్చరిక జారీ చేసింది. హనీ ట్రాప్ ఘటనలు జరిగే అవకాశాలు ఉన్నాయని అనుమానం వ్యక్తం చేస్తూ అన్ని ఫ్రాంచైజీలకు ప్రత్యేక మార్గదర్శకాలను పంపించింది.బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా పంపిన లేఖలో ఆటగాళ్లు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హోటల్ గదుల్లోకి అనుమతి లేని వ్యక్తులను తీసుకురావద్దని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన ఆటగాళ్లపై సస్పెన్షన్ సహా కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించారు.ఏడు పేజీల మార్గదర్శకాల లేఖను అన్ని జట్లకు పంపినట్లు సమాచారం. ఆటగాళ్లు, సిబ్బందిపై నిఘా పెట్టేందుకు ప్రత్యేక టాస్క్ ఫోర్స్‌ను కూడా ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. ఈ బృందంలో బీసీసీఐ మరియు ఐపీఎల్ ఆపరేషన్స్ విభాగాల సభ్యులు ఉంటారు.హోటల్ గదుల్లో



ఆకస్మిక తనిఖీలు నిర్వహించే అవకాశం ఉందని బీసీసీఐ తెలిపింది. అనుమతి లేని వ్యక్తులు కనిపిస్తే సంబంధిత ఆటగాడిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. అవసరమైతే సస్పెండ్ చేసే అవకాశాలు కూడా ఉన్నాయని పేర్కొంది.టీమ్ సభ్యుల గదుల్లోకి ఇతరులను అనుమతించబోమని బీసీసీఐ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. హోటల్ బయటకు వెళ్లే ముందు ఆటగాళ్లు సెక్యూరిటీ లైజన్ అధికారి లేదా టీమ్ ఇంటిగ్రిటీ అధికారికి సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. హోటల్ పరిసరాల్లో తిరగాలన్నా టీమ్ మేనేజర్ అనుమతి తప్పనిసరి చేశారు.ఐపీఎల్ అవినీతి నిరోధక మరియు భద్రతా విభాగం సమర్పించిన నివేదికలో డగౌట్లు, బస్సులు, హోటళ్ల వద్ద ఆటతో సంబంధం లేని వ్యక్తులు సంచరిస్తున్నట్లు గుర్తించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే బీసీసీఐ కఠిన నిబంధనలు అమలు చేస్తున్నట్లు తెలుస్తోంది.ఐపీఎల్ చైర్మన్ అరుణ్ ధుమాల్ కూడా అవినీతి నిరోధక విభాగం నివేదిక అందిన విషయాన్ని ధృవీకరించారు. ప్రస్తుతం ఈ అంశం క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# టీ20 జట్టులో మార్పుల సూచనలు..

### - సూర్య స్థానంలో శ్రేయాస్‌కు కెప్టెన్సీ?


**ముంబై, మే 8 మన ప్రజాగళం న్యూస్ :** టీమిండియా టీ20 జట్టులో భారీ మార్పులు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌ను నాయకత్వ బాధ్యతల నుంచి తప్పించి, ఆ స్థానంలో శ్రేయాస్ అయ్యర్‌కు అవకాశం ఇవ్వాలని బీసీసీఐ వర్గాలు ఆలోచిస్తున్నట్లు సమాచారం. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీ త్వరలో కొత్త కెప్టెన్‌పై నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని క్రీడా వర్గాలు



చెబుతున్నాయి. ఈ ఐపీఎల్ సీజన్‌లో పంజాబ్ కింగ్స్‌ను సమర్థంగా నడిపిస్తున్న శ్రేయాస్ అయ్యర్ నాయకత్వంపై సెలెక్టర్లు సానుకూలంగా ఉన్నట్లు తెలుస్తోంది.ఇటీవల సూర్యకుమార్ యాదవ్ బ్యాటింగ్‌లో ఆశించిన స్థాయిలో రాణించకపోవడంతో విమర్శలు ఎదుర్కొంటున్నారు. ఈ సీజన్ ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ తరపున 10 మ్యాచ్‌లు ఆడిన ఆయన కేవలం 195 పరుగులు మాత్రమే చేశారు. దీంతో జట్టులో ఆయన స్థానం పైనా సందేహాలు వ్యక్తమవుతున్నాయి.అయితే సూర్యకుమార్ చేతిమడిమ సమస్యతో బాధపడుతున్నప్పటికీ నొప్పితోనే ఆడుతున్నట్లు కొన్ని నివేదికలు వెల్లడించాయి. మరోవైపు శ్రేయాస్ అయ్యర్ మాత్రం అద్భుత ఫామ్‌లో కొనసాగుతున్నాడు. ఈ సీజన్‌లో 9 మ్యాచ్‌ల్లో 333 పరుగులు చేసి ఆకట్టుకున్నాడు.రాబోయే ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనలకు యువ ఆటగాళ్లకు ఎక్కువ అవకాశాలు ఇవ్వాలని బీసీసీఐ భావిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో కెప్టెన్సీలో కూడా కొత్త మార్పులు తీసుకురావాలని ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది.అయితే సూర్యకుమార్ కెప్టెన్‌గా ఇప్పటివరకు ఒక్క టీ20 సిరీస్ కూడా ఓడిపోలేదు. 2026 టీ20 ప్రపంచకప్ విజయంతో ఆయన నాయకత్వానికి మంచి గుర్తింపు లభించింది. మరోవైపు శ్రేయాస్ అయ్యర్ గత రెండేళ్లుగా భారత టీ20 జట్టుకు దూరంగా ఉన్నాడు. 2023 డిసెంబర్‌లో చివరిసారి టీమిండియా తరపున టీ20 మ్యాచ్ ఆడాడు.ఇప్పటికే ఈ వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, బీసీసీఐ అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# చెన్నై వీధుల్లో సీఎస్‌కే స్టార్ల సందడి..

### - ఆటోలో షికారు.. పిల్లలతో గల్లీ క్రికెట్



**చెన్నై, మే 8 మన ప్రజాగళం న్యూస్ :** ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు ఉన్న అభిమానమే ప్రత్యేకం. తాజాగా ఆ జట్టుకు చెందిన యువ విదేశీ ఆటగాళ్లు డెవాల్డ్ బ్రెవిస్, నూర్ అహ్మద్ చెన్నై నగర వీధుల్లో చేసిన సందడి అభిమానులను ఆకట్టుకుంటోంది. స్టార్ క్రికెటర్ల హంగులు పక్కనపెట్టి సామాన్యుల్లా నగరాన్ని చుట్టేస్తూ అభిమానులతో కలిసిపోయారు.మ్యాచ్‌ల మధ్యలో దొరికిన విరామ సమయంలో ఈ ఇద్దరు ఆటగాళ్లు ఖరీదైన కార్లను వదిలేసి ఆటో రిక్షాలో ప్రయాణించారు. చెన్నై వీధుల్లో ఆటోలో కనిపించిన వారిని చూసి అభిమానులు ఆశ్చర్యపోయారు. స్థానిక సంస్కృతిని ఆస్వాదిస్తూ వారు చేసిన ఈ ప్రయాణం ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.అక్కడితో ఆగకుండా ఓ స్థానిక మైదానానికి వెళ్లిన బ్రెవిస్, నూర్ అహ్మద్ అక్కడ క్రికెట్ ఆడుతున్న చిన్నారులతో కలిసి గల్లీ క్రికెట్ ఆడారు. చిన్నారులు బౌలింగ్ చేయగా బ్రెవిస్ సరదాగా షాట్లు ఆడుతూ అలరించాడు. అభిమానులతో చేతులు కలుపుతూ, ఫొటోలు దిగుతూ ఇద్దరూ సందడి చేశారు.తమ అభిమాన ఆటగాళ్లు ఇలా సాధారణ ప్రజల మధ్య కలిసిపోవడంతో సీఎస్‌కే అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ వీడియోలు, ఫొటోలు నెట్టింట విపరీతంగా వైరల్ అవుతున్నాయి.

# వైభవ్‌పై ఇంగ్లండ్ దిగ్గజాల ప్రశంసల జల్లు



**లండన్, మే 8 :** టీమిండియా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ విధ్వంసకర బ్యాటింగ్‌తో ప్రపంచ క్రికెట్‌ను ఆశ్చర్యపరుస్తున్నాడు. కేవలం 15 ఏళ్ల వయసులోనే అరుదైన రికార్డులు సృష్టిస్తూ ఐపీఎల్‌లో బౌలర్లకు భయంకరంగా మారాడు. తాజాగా ఇంగ్లండ్ మాజీ క్రికెటర్లు కూడా వైభవ్ ఆటపై ప్రశంసల వర్షం కురిపించడం విశేషంగా మారింది.'స్టిక్ టు క్రికెట్' అనే కార్యక్రమంలో పాల్గొన్న ఇంగ్లండ్ మాజీ స్పిన్నర్ ఫిల్ టఫ్నెల్ మాట్లాడుతూ.. వైభవ్ ఇదే ఫామ్ కొనసాగిస్తే 21 ఏళ్లకే అన్ని రికార్డులు సాధించి, భారీగా సంపాదించి రిటైర్ అయ్యే స్థాయికి చేరుకుంటాడని సరదాగా వ్యాఖ్యానించాడు. అతడి దూకుడు బ్యాటింగ్ చూస్తుంటే ప్రపంచ స్థాయి బౌలర్లకే భయం వేసేలా ఉందని చెప్పాడు.ఇక భారత ఆటగాళ్లపై తరచూ విమర్శలు చేసే మైఖేల్ వాన్ కూడా వైభవ్‌ను కొనియాడటం ఆసక్తికరంగా మారింది. క్రిస్ గేల్ లాంటి విధ్వంసకర ఆటగాడు కెరీర్ మధ్యలో 30 బంతుల్లో సెంచరీ చేస్తే.. వైభవ్ మాత్రం చిన్న వయసులోనే 35 బంతుల్లో శతకం బాదాడని ప్రశంసించాడు. ఈ ఐపీఎల్ సీజన్‌లో ఇప్పటికే 37 సిక్సర్లు కొట్టి బౌలర్లపై ఆధిపత్యం చాటుతున్నాడని పేర్కొన్నాడు.మరో మాజీ కెప్టెన్ అలిస్టర్ కుక్ కూడా వైభవ్‌ను ప్రపంచంలోనే అత్యుత్తమ సిక్సర్ల హిట్టర్‌గా అభివర్ణించాడు. డేవిడ్ లాయిడ్ సహా పలువురు మాజీ ఆటగాళ్లు కూడా వైభవ్ ప్రతిభను కొనియాడారు. మొత్తంగా ఇంగ్లండ్ దిగ్గజాలంతా ఒకే వేదికపై భారత యువ ఆటగాడిని ప్రశంసించడం ఇప్పుడు క్రికెట్ ప్రపంచంలో హాట్ టాపిక్‌గా మారింది.